
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



అన్నమయ్య జిల్లా వార్తలు

5

శుక్రవారం 27 డిసెంబరు 2024

నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కమనీయం నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ



సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

గుర్రంకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతన్నలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ట్రాన్స్‌కో సిబ్బంది పనిచేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ తెలిపారు. గుర్రంకొండ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయానికి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేసేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ క్రమంలో లైన్లలో సమస్యలను ముందస్తుగా గుర్తించి అంతరాయాలను అరికట్టాలని సూచించారు. వైర్లలో విద్యుత్ ప్రవాహాన్ని పసిగట్టే ఇండక్షన్ టెస్టర్‌ను ప్రతి ఒక్కరూ ఉంచుకోవాలన్నారు. తద్వారా విద్యుత్ ప్రవాహాన్ని తెలుసుకుని ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అలాగే గ్రామాల్లో పగటిపూట వీధిలైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోవోల్టేజి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ వినియోగదారులు, రైతులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం సబ్‌స్టేషన్‌లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ శివయ్య, జేఈ మౌసిన్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టులనేవే లేవు

● అవన్నీ సైబర్ నేరగాళ్ల మోసాలు

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్



కడప క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తగా ఉండాలని, డిజిటల్ అరెస్టులనేవే లేవని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. ఏ బ్యాంకు వారు కూడా ఓటీపీలు అడగరన్నారు. తెలియని వ్యక్తులు ఎవరు అడిగినా ఓటీపీ చెప్పకూడదన్నారు. ఎవరికీ షేర్ చేయకూడదన్నారు. తెలియని లింకులు క్లిక్ చేయకూడదన్నారు. డిజిటల్ అరెస్టులు అనేవి సైబర్ నేరగాళ్లు చేసే మోసాలన్నారు. బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ లేకుండా ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే లోను ఇస్తామంటే అనుమానించాలన్నారు. మీకు తక్కువ మొత్తం లోను ఇచ్చి భారీ మొత్తం తిరిగి చెల్లించమంటారని లేకపోతే మీ గ్యాలరీలోని ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి మీ ఫోనులోని బంధువులకు, స్నేహితులకు పంపుతామని బెదిరిస్తారన్నారు. సైబర్ నేరాల బారిన పడితే 1930కు ఫోను చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జీవోవి.ఇన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైసీపీ కంచుకోటలు బద్ధలు

● అరాచక పాలనకు చరమగీతం ● కూటమికి ప్రజల బ్రహ్మరథం.. ● వైసీపీకి నిరాశ మిగిల్చిన 2024

ఐదు సంవత్సరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడించి కూటమికి బ్రహ్మరథం పట్టారు. 2009 నుంచి ఓటమే ఎరుగని స్థానాల్లోనూ ఆ పార్టీకి ఓటమిని రుచి చూపించి.. వైసీపీ కంచుకోటలను బద్దలుకొట్టారు. ప్రజాకంటక వైసీపీ పాలన పట్ల విరక్తి చెందిన ప్రజలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కలయికతో ఏర్పడిన కూటమికి జైకొట్టారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో నాలుగింట కూటమికి విజయం కట్టబెట్టారు. మిగిలిన రెండు స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీ అంతర్గత విభేదాలతో ఓటమి చవిచూసిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలు వైసీపీకి పీడకలను మిగిల్చాయి.



రౌండప్ 2024

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో 2012 ఉప ఎన్నికల నాటి నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల వరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ వైసీపీనే గెలుపు సాధిస్తోంది. 2011లో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు స్థానాలకు అప్పటికే కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన శ్రీకాంత్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి జగన్ వెంట నడిచారు. దీంతో 2012లో ఈ స్థానాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో మూడింటిలోనూ వైసీపీ ఘన విజయం సాధించింది. తర్వాత 2014 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. మిగిలిన అన్ని స్థానాల్లోనూ వైసీపీనే గెలుపొందింది. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీనే పట్టు నిరూపించుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఘన విజయం సాధించింది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లోనూ ఆ పార్టీ విజయదుందుభి మోగించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు 98 శాతం ఆ పార్టీనే గెలుచుకుంది. దీంతో అన్నమయ్య జిల్లా వైసీపీకి కంచుకోటగా మారింది.

కూటమికి బ్రహ్మరథం


2024 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ప్రజలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి బ్రహ్మరథం పట్టారు. ఆ ఎన్నికల్లో ప్రజలు కొట్టిన దెబ్బకు వైసీపీకి బొమ్మ కనపడింది. ఆరింటిలో కేవలం రెండు చోట్ల మాత్రమే గెలుపొందింది. రైల్వేకోడూరులో కూటమి అభ్యర్థి జనసేనకు చెందిన అరవ శ్రీధర్ గెలుపొందగా రాయచోటిలో మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, పీలేరులో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లెలో షాజహాన్‌బాషలు తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొందారు. తంబళ్లపల్లెలో టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, రాజంపేటలో సుగవాసి బాలసుబ్రమణ్యంలు ఓటమి చెందారు. ఈ రెండుచోట్ల కూడా టీడీపీలో అంతర్గత విభేదాల కారణంగానే వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు.

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రజల్లో వైసీపీ పట్ల పూర్తి వ్యతిరేకత ఏర్పడడానికి ప్రధానంగా కొన్ని సంఘటనలు చెప్పుకోవచ్చు. అందులో ముఖ్యమైనవి.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరుతో జిల్లాలో జరిగిన భూఆక్రమణలు, అక్రమాలు, దౌర్జన్యాలు.. దాడులు అని చెప్పవచ్చు. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వేల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి ప్రైవేటు వ్యక్తుల ఆస్తులు కూడా కబ్జాకు గురయ్యాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు అడిగిన ధరకే భూములు అమ్ముకోవాల్సిన దారుణ పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు ఆస్తులు పోగొట్టుకున్నారు. పెద్దిరెడ్డి అనుచరులు, బినామీలు ప్రభుత్వ భూములను దర్జాగా కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఫ్రీహోల్డ్ పేరుతో అత్యంత విలువైన భూములను నిబంధనలకు విరుద్ధంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోననే భయంతోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజులకే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్ళను దహనం చేశారు. ఇప్పటికీ ఈ కేసును ఏపీసీఐడీ విచారణ చేస్తోంది. ఇసుక అక్రమ రవాణా కూడా ఎక్కువగా వైసీపీకి నష్టం చేకూర్చింది. లక్షలాది టన్నులు జిల్లా నుంచి బెంగళూరుకు అక్రమంగా తరలించేశారు. వైసీపీకి చెంది న ఎమ్మెల్యే స్థాయి నాయకులు స్వయంగా ఇసుక అక్రమ రవాణాలో ఉండడంతో వారి అనుచరుల ఆగడాలు మితిమీరిపోయాయి. ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించిన వారిపైన దాడులు, అక్రమ కేసు లు నమోదు చేశారు. అదే సమయంలో ఇసుక దొరకకపోవడంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కూలి పనులు లేక కూలీలు ఇబ్బంది పడిపోయారు. వీటితో పాటు విపరీతంగా పెరిగిన నిత్యావసర ధరలు, పెరిగిన మద్యం ధరలు ఇలా ఒకటే మిటి.. అనేక కారణాలు ఉన్నాయనే చెప్పవచ్చు.

మలుపు తిప్పిన యువగళం..

చంద్రబాబు అరెస్టు

జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలపడడానికి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర, అప్పటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టులు ఉపయోగపడ్డాయి. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల అరాచకాలతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి మద్దతుగా బహిరంగంగా మాట్లాడే వాళ్లే కనిపించని రోజుల్లో ఏటికి ఎదురీదినట్లు నారా లోకేశ్ యువగళం పాదయాత్రను చేపట్టారు. కుప్పం నుంచి మొదలైన ఈ పాదయాత్ర పీలేరులో జిల్లాలోకి ప్రవేశించింది. యువగళం పాదయాత్రను సజావుగా సాగనీయకుండా అప్పటి జగన్‌రెడ్డి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. అయినా వీటన్నింటినీ ఎదుర్కొని నారా లోకేశ్ యువగళం యాత్రను పూర్తి చేశారు. ఈ యాత్ర అప్పటి వరకు వైసీపీ అరాచకాలకు భయపడి మౌనంగా ఉన్న టీడీపీ కార్యకర్తల్లో ఎక్కడ లేని ధైర్యం తెచ్చి పెట్టింది. ముఖ్య నాయకులు ఈ పాదయాత్ర తర్వాత పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. అదే విధంగా అప్పటి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును జగన్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులో అరెస్టు చేసింది. సుమారు 52 రోజుల పాటు జైలులో అక్రమంగా నిర్బంధించింది. ఈ అక్రమ అరెస్టు జిల్లాలోని ప్రతి పట్టణం, పల్లెను ఏకం చేసింది. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరశిస్తూ స్వచ్ఛందంగా లక్షల మంది ప్రజలు రోడ్డెక్కారు. ఈ నిరసనలను అడ్డుకోవాలని వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించినప్పటికీ ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు భయపడకుండా రోజూ కార్యక్రమాలను చేపట్టారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చేవరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సంఘటన కూడా సామాన్య జనంలోకి తీవ్రంగా వెళ్ళింది. ఇప్పుడు అక్రమంగా చంద్రబాబును అరెస్టు చేశారు. మళ్ళీ వైసీపీ అధికారంలోకి వస్తే సామాన్యులు బతకడం కష్టమే అనే భావన మారుమూల పల్లెలకు సైతం వెళ్లిపోయింది. ఈ సంఘటనలన్నింటి నేపథ్యంలో.. 2024 ఎన్నికల్లో వైసీపీ కంచుకోటలు బద్ధలైపోయాయి. 2024 మే 13న ఎన్నికలు జరగ్గా జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగింది. జూన్ 12న కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఐదేళ్ల అరాచకపాలనతో విసిగిపోయిన ప్రజలు ఒకసారిగా స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించాము.. 2024 ఎన్నికల్లో 175కి 175 వై నాట్ అంటూ.. ఊరూవాడా ఊదరగొట్టిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు కేవలం 11 సీట్లే ఇచ్చారు. ఇందులో అన్నమయ్య జిల్లాలోనే రెండు ఉన్నాయి. దీంతో 2024 వైసీపీకి నిరాశనే మిగిల్చిందని చెప్పవచ్చు.

















మామిడి రైతు గుల్ల

● మూడు రోజులుగా ముసురు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

● ఆందోళనలో మామిడి రైతులు

6



'సూర్య ఘర్'పై అవగాహన కల్పించాలి

● విద్యుత్ ఎస్ఈ రమణ

6

హత్య కేసులో నిందితుల అరెస్ట్

విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు తప్పవు

● 50 మందిని ఆందోళనకారులుగా గుర్తించాం

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మతపరమైన విద్వేషాలు రెచ్చగొడి తే చర్యలు తప్పవని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. గురువారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం మదనపల్లెలో ఇరువర్గాలకు సంబంధించి జరిగిన ఘ ర్షణ వివరాలను డీఎస్పీ కొండయ్యనాయుడు ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ ఇద్దరు ద్విచక్ర వాహన దారుల ఘర్షణ చిన్నపాటిదైనప్పటికీ కొంతమంది కావాలనే దానిని పెద్దదిగా సృష్టించేందుకు ప్రయత్నించారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. కొంతమంది కావాలనే రెచ్చగొట్టి చిన్న విషయాన్ని పెద్దదిగా చేస్తూ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనలు చేశారని, ఇందులో అలాంటి వారిని 50మందిని గుర్తించామని, మిగిలిన వారిని కూడా గుర్తించి వారిపై కేసులు నమో దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఉ న్న మదనపల్లెలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కొందరు ఓ హోటల్‌ను ధ్వంసం చేశారన్నారు. మదనపల్లెలో మత విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రాజంపేట డీఎస్పీ సుధాకర్, మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, ఎస్‌బీ సీఐ సత్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

15 పోలీసు పికెట్లు ఏర్పాటు

మదనపల్లెలో 15 పోలీసు పికెట్లను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. భారీ బందోబస్తులో భాగంగా ముగ్గు రు డీఎస్పీలు, పదిమంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, వందమంది సిబ్బందితో ప్రధాన కూడళ్లలో భారీ బందోబస్తు కోసం పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మదనపల్లెలో ప్ర శాంత వాతావరణం నెలకొల్పడానికి కట్టుది ట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మాకూ ఇవ్వండి..తాళాలు..

● రిజిస్ట్రేషన్లు ఎప్పుడు చేస్తారో..

● 166 మంది టిడ్కో లబ్ధిదారుల నిరీక్షణ

మదనపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన టిడ్కో గృహాలు పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారుల పేరున ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసి ఇటీవల తాళాలు అప్పగించారు. మరికొందరికి మాత్రం రిజిస్ట్రేషన్లు చేయలేదు. తాళాలు అప్పగించలేదు. ప్లాటు మాత్రమే కేటాయించారు. ప్రస్తుతం వారంతా ఈ ప్రక్రియ పూర్తి చేసి తాళాలు అప్పగిస్తే. గృహప్రవేశాలు చేసుకుంటామని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మదనపల్లె-తిరుపతి ప్రధాన రహదారి పక్కన 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేశారు. వెంకప్పకోట సమీపంలో ఈ బహుళ అంతస్తుల సముదాయాన్ని నిర్మించారు. జీ ప్లస్ త్రీ నమూనాలో 39 బ్లాకులు, ఒక్కో బ్లాకులో 48 ఇళ్లు చొప్పున మొత్తం 1,872 గృహాలు పూర్తి చేశారు. ఇప్పటికే విడతలవారీగా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించగా, ఏడాది క్రితం వారి పేరున స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ అధికారులు రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు అందజేశారు. ఈ క్రమంలో అప్పటికే టీడీపీ ప్రభుత్వంలో సగానికిపైగా నిర్మాణాలు పూర్తి కాగా, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మరోసగం ఇళ్లను పూర్తి చేసింది. ఈ రెండు సందర్భాల్లోనూ ప్రభుత్వాలు మారిపోవడంతో చివరి దశలోని పనులు పెండింగ్ పడుతూ వచ్చాయి. తాజాగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం బహుళ అంతస్థులను పూర్తి చేసి, అక్కడ ప్రజలు నివాసాలు ఉండటానికి కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ కల్పించింది. 300 చ.అ.విస్తీర్ణంలో నిర్మించిన ఈ గృహాలు ఇటీవల పూర్తి కాగా, వారం రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా చేతుల మీదుగా లబ్ధిదారులకు తాళాలు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 520 మందికి ప్లాట్లు అప్పగించగా, రోజువారీ ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

వివిధ కారణాలతో ఏడాదిక్రితం జరిగిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు దూరంగా ఉన్న 166 మంది పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ప్రస్తుతం వారంతా మాకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయాలని ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో వారంతా సచివాలయం, మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రిజిస్ట్రేషన్లు కాని 166 మందిలో కొందరు లబ్ధిదారులు చనిపోగా, మరికొందరు ఇతర ప్రాంతాలకు వలసపోయారని, ఇంకొందరి ఆచూకీ దొరకడం లేదని అధికారులు, సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. టిడ్కో ఇల్లు మంజూరైన వారిలో ఎక్కువగా పేద, మధ్యతరగతి, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారే ఉన్నారు. కానీ చనిపోయిన వారి ఫ్లాటును వారి వారసుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయనున్నారు. అలాగే అప్పట్లో ఉపాధి కోసం వలసపోయిన వారు కూడా ప్రస్తుతం టిడ్కో ఇంటి కోసం పట్టణానికి తిరిగి వచ్చి అధికారులను ఆశ్రయిస్తున్నారు. తమకూ రిజిస్ట్రేషన్ చేసి తాళాలు ఇస్తే స్థానికంగానే నివాసం ఉంటామని కోరుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వం 300 చ.అ. విస్తీర్ణం, 350 చ.అ, 400 చ.అ. విస్తీర్ణంతో మూడు కేటగిరీలలో పేదలకు బహుళ అంతస్తులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా అప్పట్లోనే అన్ని విభాగాలకు పునాదులు పూర్తి చేయగా, 300 చ.అ. విస్తీర్ణంలోని 13బ్లాకులను పూర్తి చేసింది, తర్వాత ప్రభుత్వం మారడం, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో 350 చ.అ., 400 చ.అ. విస్తీర్ణం గల నివాసాలను రద్దు చేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో నిర్మాణాలను మరింత జాప్యం చేసింది. అప్పటికే ఉన్న ఎన్‌సీసీ కంపెనీని నిర్మాణ బాధ్యతల నుంచి తప్పించి డీఈసీ కంపెనీకి కట్టబెట్టింది. ఇలా వివిధ కారణాలతో నిర్మాణాల్లో జాప్యం కాగా తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయిదు నెలల్లోనే పూర్తి చేసి లబ్ధిదారులకు గృహప్రవేశాలకు అవకాశం కల్పించింది. అది కూడా గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలు మంజూరు చేయగా, తిరిగి కూటమి ప్రభుత్వం చేతుల మీదుగా తాళాలు తీసుకోవడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టిడ్కో ఇళ్ల సముదాయాల్లో 50 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారి, 30 అడుగుల వెడల్పుతో అంతర్గత సిమెంటురోడ్లు నిర్మించారు. మురికినీటి కాలువలు, నివాసాల నుంచి వెలువడే వ్యర్థపు నీటిని శుద్ధి చేయడానికి సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్‌టీపీ)ను కూడా ప్రత్యేకంగా చేపట్టారు. ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలకోసం జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు, ఏడు తాగునీటి పథకాలు చేపట్టారు. విద్యుత్తు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా, తదితర మౌలిక సదుపాయాల కల్పనతో ఆ ప్రాంతం స్మార్ట్ సిటీని తలపిస్తోంది. పక్కపక్కనే మూడు ఏరియాలలో నిర్మించిన ఈ సముదాయం నుంచి వ్యర్థపునీటిని శుద్ధి చేయడానికి నిర్మించిన ట్రీట్‌మెంట్ ప్లాంటుకు అనుసంధానం చేశారు. ప్రభుత్వం ఇక్కడ అన్ని సౌకర్యాలు, సదుపాయాలు కల్పించడంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న లబ్ధిదారులు ఇక్కడ నివాసం ఉండటానికి ముందుకొస్తున్నారు.



మదనపల్లెలో పూర్తయిన టిడ్కో గృహాలు

అనుమతి రాగానే రిజిస్ట్రేషన్లు చేస్తాం..

ఏడాది క్రితం చేపట్టిన టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు వారంతా వివిధ కారణాలతో దూరంగా ఉన్నారు. తర్వాత ఎన్నికల కోడ్ కూడా రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. తర్వాత ప్రభుత్వం మారింది. ఆ వెబ్‌సైట్ క్లోజ్ అయింది. తిరిగి ప్రభుత్వం నుంచి అనుమతి, విధి విధానాలు రాగానే రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తాం. ఎవరూ కూడా ఫ్లాటు రాదనే ఆందోళన పడాల్సిన పనిలేదు. కొందరు లబ్ధిదారులు మరణించినట్లు చెబుతున్నారు. అలాంటి వారిలో ఆ కుటుంబంలో నామినీల పేరున రిజిస్ట్రేషన్ చేసి, తాళాలు అప్పగిస్తాం. ఇప్పటికే ఆయా సచివాలయాలకు సమాచారమిచ్చాం.

- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె



తాళం వేసిన లబ్ధిదారుడికి కేటాయించని ప్లాటు



పూర్తయిన జీఎల్ఎస్ఆర్ తాగునీటి ట్యాంకు

- వైసీపీ ప్రభుత్వంలో దక్కని బీమా
- ఈ-క్రాప్‌లో తప్పుల తడకతో నష్టం
- ఈ ప్రభుత్వమైనా పాత పద్ధతిని పూర్తి స్థాయిలో అమలు చేసేనా ?

పంటల బీమా.. రైతుకు ధీమాగా నిలిచేనా?

పులివెందుల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకం రైతులకు భరోసా ఇవ్వడం లేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ-క్రాప్ విధానం తప్పులతడకగా ఉండటంతో తమకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతూ వచ్చారు. పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని నాటి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే.. ఆ మేరకు ఒక్క ఏడాది కూడా రైతులకు పంటల బీమా సక్రమంగా అందలేదు. కూటమి ప్రభుత్వం అయినా పాతపద్ధతినే పూర్తి స్థాయిలో అమలుచేసి రైతుకు ధీమానిస్తుందా లేక వైసీపీ పద్ధతినే అవలంబిస్తుందో తెలియాల్సిఉంది.

పంట సాగుచేసేందుకు రైతులు బ్యాంకుల్లో ప్రతి ఏడాదిపంట రుణాలు తీసుకుంటారు. తీసుకునే సమయంలోనే ఏ పంటకు రుణాలు తీసుకుంటున్నారో దానికి సంబంధించి బీమా ప్రీమియం బ్యాంకుకు చెల్లిస్తారు. బ్యాంకుల్లో రుణాలు పొందని రైతులు నేరుగా మీసేవ ద్వారా లేదా ప్రైవేట్ సంస్థల ద్వారా ప్రీమియం చెల్లించి బీమా చేసుకుంటారు. ఇది వైసీపీ ప్రభుత్వం రాకమునుపు సాగుతున్న తంతు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి పంటలకు సంబంధించిన ప్రీమియం వసూలుచేయవద్దని ప్రభుత్వమే చెల్లిస్తుందని బ్యాంకులకు ఆదేశాలిచ్చింది. దీనితో బ్యాంకులు ప్రీమియం వసూలు చేయకుండా కేవలం తీసుకున్న పంట రుణాలకు రెన్యువల్ చేసుకుని వడ్డీ వసూలు చేయడంతోనే సరిపెడుతూ వచ్చారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రీమియం సక్రమంగా చెల్లించకపోవడంతో పంటనష్టపోయిన సమయంలో పరిహారం అందకం రైతులు నష్టపోయారు. ఇటు కడప జిల్లా అటు అన్నమయ్య జిల్లా రైతాంగం కరువు కాటకాలతో అల్లాడుతూంటారు. గత నాలుగైదేళ్లుగా పంటల దిగుబడి చూస్తే ఏ ఒక్క ఏడాది కూడా రైతులకు లాభాలు చేకూరింది లేదు. వర్షాలు కూడా సాగు చేయడానికి వీలుగా అనువైన సమయంలో కురవడం లేదు. పదును దాటాక కురిసిన వర్షానికి పంట సాగుచేస్తే గింజ మొలకెత్తి ఏపుగా పెరిగినా.. కాతకాసే సమయానికి లేదా పంట ఒబ్బిడి చేసే వేళకు వర్షాలు రాక పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆ పంటలకు బీమా చేసి ఉంటే ప్రభుత్వం ఆ మేరకు సొమ్మును ఇచ్చి రైతులను ఆదుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రైతులు సాగుచేసిన పంటలకు ప్రీమయం చెల్లించలేదు. రైతులు చెల్లించవద్దని తామే చెల్లిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఇ-క్రాప్ విధానంతో బీమా పరిహారం అందిస్తామని చెప్పింది. అయితే ఈ ఏడాది కూడా రైతు సాగుచేసిన పంటలన్నిటికి పూర్తిస్థాయిలో పరిహారం దక్కలేదు. కంటితుడుపు చర్యగా బీమా పరిహారం చెల్లించారు. ఒక్క రైతు పది ఎకరాల పంట సాగుచేస్తే మూడు, నాలుగు ఎకరాలు సాగుచేసినట్లు ఇ-క్రాప్‌లో నమోదు చేశారు. దీంతో ఆ మూడునాలుగు ఎకరాలకు అరకొర పరిహారం ప్రభుత్వం విదిల్చేది. పంట సాగుచేసినా ఏ పంట వేశారనే వివరాలు కూడా ఈ-క్రాప్‌లో లేకపోవడంతో ఆ రైతులకు మరింత నష్టాలనే మిగిల్చింది.


పులివెందుల ప్రాంతంలో సాగులో ఉన్న శనగ

ఫసల్ బీమా తొలగించడంతో తీవ్ర నష్టం

ముఖ్యంగా రైతులు ఖరీఫ్‌లో పంటల సాగుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని అదే సమయంలో ఆ పంటకు ఫసల్ బీమాకోసం ప్రీమియం కూడా చెల్లిస్తారు. ఫసల్ బీమాలో రైతులకు ఎంతో వెసులుబాటు ఉండేది. ఫసల్ బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటే పంట సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి వర్షాలు పడక పంట సాగుకాకపోయినా కొంత మొత్తం రైతులకు దక్కుతుంది. అంటే పంట సాగుచేసి పంటల మధ్యకాలంలో వర్షాలు కురవక పంట ఎండిపోతేనే బీమా వస్తుందన్నది వాతావరణ బీమా పద్ధతి. కానీ పంట సాగుసమయంలో వర్షాలు కురవక పోయినా ప్రకృతి వైపరీత్యమే అని కేంద్ర ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రీమియం తామే చెల్లిస్తామని ప్రకటించి పాత పద్ధతిని పూర్తిగా తొలగించింది. దీంతో ఏ పంటకు రుణాలు తీసుకోవాలో, ఏ పంటకు ప్రీమియం చెల్లించాలో రైతులకు అర్థం కాకుండా మారిపోయింది. దీనికి తగ్గట్టే వైసీపీ ప్రభుత్వంలో రైతులకు పంటల బీమా సక్రమంగా అందలేదు.


పులివెందులలో సాగులో ఉన్న కంది పంట

ఈ ప్రభుత్వమైనా ధీమానిస్తుందా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత పద్ధతిలోనే పంటల బీమా అమలు చేస్తామని ప్రకటించింది. కానీ దానికి ఈ-క్రాప్ లింకప్ చేస్తామనడంతో రైతులు ఈ ప్రభుత్వం కూడా వైసీపీ ప్రభుత్వంలాగా చేస్తుందేమోనని అనుమానిస్తున్నారు. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే సమయంలోనే ఆ పంటకు ప్రీమియం తీసుకునే పరిస్థితి ఉంటే ఈ-క్రాప్ పద్ధతి ఎలా కుదురుతుందని ప్రశ్నిస్తున్నారు.

పంట సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వర్షాలు కురవక పంటే సాగుకాకపోతే ఈ-క్రాప్ ఎక్కడి నుంచి తేవాలని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ-క్రాప్ పద్ధతి పూర్తిగా పక్కన పెట్టేయాలని రైతులు కోరుతున్నారు. రైతులు సాగుచేసిన పంటకు ప్రీమియం చెలిస్తే నష్టం జరిగిందా లేదా అని గుర్తించి బీమా ఇస్తే రైతులకు కాస్తోకూస్తో భరోసా దక్కుతుంది. 2014-2019లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పంటల బీమాకు సంబంధించి ఎలాంటి విధానాలు అమలు చేసిందో అదే పద్ధతిని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్ : డీఎస్పీ


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

గాలివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కళాకారుడు సత్యన్న హత్య కేసులో నిందితులైన వెంకటరమణారెడ్డి, అతడి కుమారులైన శివశంకర్‌రెడ్డి, రామాంజులరెడ్డిలను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లె గ్రామ కస్పాలో పెద్దకర్మ సందర్భంగా కీచకవధ వీధి నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి కీచకుడి పాత్ర పోషించగా తలారి పాత్రను సత్యన్న అలియాస్ వెంకటరమణ పోషించారు. నాటకం ప్రదర్శించే సందర్భంలో ఇరువురి మధ్య మనస్పర్థల కారణంగా గొడవ మొదలైంది. ఈ గొడవ విషయంలో గ్రామంలో ఉన్న పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పినా వినకుండా నాటకం మధ్యలోనే ఆపివేశారు. ఈ క్రమంలో సత్యన్న, రమణారెడ్డిలు తిరుగు ప్రయాణమై బోరెడ్డిగారిపల్లె బస్టాప్ వద్దకు రాగానే వెంకట్రమణారెడ్డి సత్యన్న తలపై బండరాయితో బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వెంకటరమణారెడ్డి తన కుమారులకు ఫోన్ చేసి సంఘటనాస్థలానికి పిలిపించుకుని తన సొంత ఆటోలో సత్యన్న మృతదేహాన్ని వేసుకుని సమీపంలోని మంగళపల్లి గుట్ట వద్ద పడవేసినట్లు, ఈ హత్యను తామే చేసినట్లు నిందితులు డీఎస్పీ ఎదుట అంగీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణలను అభినందించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతదేహం, పవన్‌కుమార్ (ఫైల్)

గాలివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలివీడు, కోనంపేట ప్రధాన రహదారిలో ఆటో ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో కొట్లపల్లి పవన్‌కుమార్ (18) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లె గ్రామం హరిజనవాడకు చెందిన పవన్‌కుమార్ గాలివీడు పంచాయతీ హరిజనవాడలో తన సోదరి ఇంటికి వచ్చి తిరుగు పయనమయ్యాడు. నూలివీడు, లక్కిరెడ్డిపల్లె సమీపంలోకి రాగానే లక్కిరెడ్డిపల్లె నుంచి గాలివీడుకు వస్తున్న ఆటో.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పవన్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. అదే మార్గంలో వస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ ప్రమాద స్థలంలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడిని వారి వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘాట్‌లో రక్షణ గోడను ఢీకొట్టిన లారీ



రామాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు ఘాట్ 2వ మలుపు వద్ద గురువారం సిమెంటు లారీ అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొని ఆగిపోయింది. ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డారు. రక్షణగోడ లేకుంటే 50 అడుగుల లోతు లోయలో సిమెంటుతో సహా లారీ పడిపోయేది. చిరుజల్లులు కురుస్తుండడం, రోడ్డుపై తేమ ఉండడంతో టైర్లు, రోడ్డు గ్రిప్పు కోల్పోవడం వల్లే మలుపులో ఘాటు దిగుతూ ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది.

'సూర్య ఘర్'పై అవగాహన కల్పించాలి

- ఎస్ఈ రమణ


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

పీలేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై విద్యుత్ వినియోగులకు విస్తృత అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ రమణ పీలేరు డివిజన్‌లో విద్యుత్ ఉద్యోగులను ఆదేశించారు. పీలేరు డివిజన్ ప్రగతిపై గురువారం ఆయన స్థానిక ఈఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన ద్వారా రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్‌లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తోందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి అతి తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణాలు అందిస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వినియోగదారులను చైతన్యపరచాలని ఆయన తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు లోవోల్టేజ్ సమస్యను అధిగమించాలని, అందుకు నెలకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల చొప్పున నిర్వహణ పనులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర రెడ్డి, డీఈలు అమీర్‌బాషా, శివయ్య, పీలేరు, కేవీపల్లె, కలికిరి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల ఏఈలు, జేఈలు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో...

కలకడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ వినియోగదారులు పీఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా సబ్సిడీతో ఏర్పాటు చేయనున్న సోలార్ రూఫ్‌టాప్‌ను వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ కోరారు. కలకడ మండలం కె.కొత్తపల్లెలో జరుగుతున్న అర్హుల గుర్తింపు నమోదును గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినియోగదారులు తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్‌కు ఒక యూనిట్‌కు రూ.2.30 పైసలు తిరిగి పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ శివయ్య, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

మామిడి రైతు గుల్ల

- మూడు రోజులుగా ముసురు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆందోళనలో మామిడి రైతులు

రైల్వేకోడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా పడుతున్న ముసురు వర్షంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షంతో మామిడికి పూతలు వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా వచ్చిన పూతలు కూడా ఈ వర్షంతో మాడిపోయాయి. కొన్ని తోటల్లో వర్షం దెబ్బకు పూర్తిగా పూత రాలిపోయింది. దీంతో మామిడి రైతు గుల్ల అయ్యాడు. మూడు రోజులుగా తుఫాన్ కారణంగా ముసురు వర్షం పట్టింది. ఇప్పటికే పలు దఫాలుగా భారీ వర్షాలు కురవడంతో మామిడి రైతులు ఆందోళనలో పడ్డారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో ఎక్కువగా మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో మామిడి సుమారు 20 వేల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. మామిడికి పూత దశలో వర్షం కురిస్తే మాడిపోతుంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడికి ముందస్తుగానే పూతలు వచ్చాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే తుఫాన్ కారణంగా పలు దఫాలుగా వర్షాలు కురవడంతో వచ్చిన పూతలు రాలిపోవడంతో పాటు మగ్గిపోయాయి. మామిడి రైతులకు ఈ వర్షాలు శాపంలా మారాయని వాపోతున్నారు. వర్షాలు కురిసి ఆగిపోయిన తర్వాత ఒకవేళ నిలిచినా వచ్చిన కాయలకు మంగు ఏర్పడుతుందని వ్యాపారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మామిడి తోటల్లో ఇప్పటికీ పూతలు రాలేదు. ఇప్పటికే రైతులు మామిడి తోటలకు మందులు పిచికారీ చేసి ఉన్నారు. దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశారు. గత ఏడాదిలో దిగుబడులు 20 శాతం వచ్చాయి. ఈ ఏడాది 5 శాతం కూడా దిగుబడులు వచ్చేలా లేవని రైతులు వాపోతున్నారు. రైతులు మామిడి తోటల దున్నకాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వ్యాపారుల నుంచి డబ్బులు ముందస్తుగా తీసుకున్నారు. తీసుకున్న రుణాలకు వడ్డీలు వచ్చే ఏడాదికి వడ్డీలు పెరుగుతాయి. దిగుబడులు బాగా వస్తే ఇచ్చిన రుణాలు తీరిపోయి డబ్బులు మిగులుతాయని రైతులు అంటున్నారు. భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో పూతలు త్వరగా వస్తాయన్న నమ్మకం రైతుల్లో లేదు. వర్షాలు పూర్తిగా ఆగిపోయిన తర్వాత మళ్లీ మందులు పిచికారీ చేస్తే పూతలు వచ్చినా కాయలు కోతకు ఆలస్యం అవుతుందని వ్యాపారులు అంటున్నారు. రైల్వేకోడూరు మామిడి కాయల కంటే ముందస్తుగా విజయవాడ, బంగారుపాళెం, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాలకు చెందిన మామిడి కాయలు మార్కెట్‌లోకి ప్రతి ఏడాది వస్తాయి. దీంతో రైల్వేకోడూరు మామిడి కాయలకు డిమాండ్ పెద్దగా ఉండకపోవచ్చునని పలువురు రైతులు అంటున్నారు. ఇదే వర్షాలు అక్కడ కూడా ఉంటే అన్ని ప్రాంతాలకు చెందిన మామిడి కాయలు ఒకేసారి ఆలస్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. మొత్తానికి వర్షాలు రైల్వేకోడూరును వీడడం లేదు. మూడు రోజులుగా తుంపరతో మొదలైన ముసురు వర్షం పట్టిపీడిస్తోంది. వర్షాలు పూర్తి స్థాయిలో తగ్గిపోయి ఎండ బాగా కాస్తే మామిడికి పూతలు వచ్చే అవకాశాలు ఉంటాయని శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖాధికారులు అంటున్నారు.


పూతరాని మామిడి చెట్లు


రైల్వేకోడూరు లో కురుస్తున్న వర్షం

మామిడికి వర్షం దెబ్బ



మామిడికి వర్షం దెబ్బపడింది. ముందస్తుగా వచ్చిన పూతలు రాలిపోయాయి. కొన్ని తోటల్లో మగ్గిపోయినాయి. దీంతో రైతులు అల్లాడుతున్నారు. ఉమ్మకాపుతో కొందరు రైతులు కోలుకున్నారు. బేనీషా, తోతాపూరి, నీలం, మాల్గోవా, చెరుకు రసం, ఖాదర్, మల్లిక, రుమాణి, పులిహోరా తదతర రకాల మామిడి కాయలకు మంచి డిమాండు ఉంటుంది. అయితే వర్షం దెబ్బకు మామిడి రైతులు డీలా పడ్డారు. వరుణ దేవుడు కరుణించి మామిడి రైతులను కాపాడాలి.

- కస్తూరి రామచంద్రయ్యనాయుడు,
రైల్వేకోడూరు మామిడి రైతు


రైల్వేకోడూరులో కమ్ముకున్న మేఘాలు

మామిడి సాగుకు ఖర్చు అధికం



మామిడి సాగుకు ఖర్చు ఎక్కువగా ఉంది. ఇది రైతులకు ప్రతి ఏటా భారంగా మారింది. దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రతి ఏటా కాయలకు మంగు వస్తోంది. దీంతో మార్కెట్లోకి కాయలు పోవడం లేదు. వర్షంతో కాయలకు మచ్చపడుతోంది. చాలామంది రైతులు వేపనూనెను పిచికారీ చేయడంతో చాలా మంది రైతుల తోటలకు మేలు కలగడమే కాకుండా పూతలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

- సాదు చంద్రపాల్, మైసూరివారిపల్లె,
మామిడి రైతు, వ్యాపారి

వైద్య సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాగరాజు

సిద్దవటం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదిన్‌సాహెబ్‌పల్లె పాఠశాలలో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమాన్ని కడప డీఎంహెచ్‌వో నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అంగన్వాడీ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతులుగా ఉండేలా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కడప-చెన్నై జాతీయ రహదారి మాధవరం, ఉప్పరపల్లె పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె ప్రాంతాల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రజలకు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. 104 వైద్యసేవలు ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్ రమణయ్య, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య మృతి



రైల్వేకోడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేడ్కర్‌నగర్ వాసి 11వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 1995వ బ్యాచ్‌కు చెందిన చోడవరం రాజయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. 15 రోజుల విధుల నిమిత్తం విజయవాడలోని తాడేపల్లిలో గల సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. రెండు రోజులుగా ఆయన అనారోగ్యం తో బాధపడుతున్నారు. గురువారం చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను మాయమాటలతో లొంగదీసుకుని తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. పీటీఎం ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కందుకూరుకు చెందిన గుర్రాల నరసింహులు అనే యువకుడు ఓ బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని తీసుకెళ్లి పోయాడన్నారు. ఆ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆ యువకుడిని పట్టుకుని అతడిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

కలకడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు అన్వర్‌సాహెబ్‌కు గాయాలయ్యాయి. మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీ దిగువపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అన్వర్ సాహెబ్ ఉదయం కలకడ నుంచి ద్విచక్ర వాహనంలో విధులకు బయలుదేరాడు. ఈ క్రమంలో గుర్రంకొండ నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయుడికి రక్తగాయాలు కావడంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చౌటపల్లెలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్‌ఎస్‌కే భవన సముదాయం

రూ.లక్షల వ్యయం... లక్ష్యానికి దూరం

● అసంపూర్తిగా రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణాలు ● ఆర్‌ఎస్‌కేల్లో కియోస్క్ సేవలు అంతంతే

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో రైతుసేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ద్వారా అన్నదాతలకు అరకొర సేవలు అందుతున్నాయి. ఈ వ్యవస్థ అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికీ బాలరిష్టాలు దాటలేదు. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, సాంకేతిక సమస్యలతో చాలా చోట్ల కియోస్క్ యంత్రాల సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలను నమోదు చేసుకుంటే ఎవరికి ఏరకం కావాలో తెప్పించే అవకాశం ఉండేది. నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు.

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 2020 మే నెలలో రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుత రైతుసేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. తొలుత ప్రభుత్వ భవనాలు లేని ప్రాంతాల్లో ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సొంత భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. లక్షల రూపాయల వ్యయంతో మొదలు పెట్టిన ఈ భవనాలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పూర్తయ్యాయి. చాలా చోట్ల నిధుల మంజూరులో జాప్యం కావడంతో అసంపూర్తిగా నిర్మాణాలు ఆగిపోయాయి. మరికొన్ని చోట్ల స్థలాల సమస్యతో భవన నిర్మాణాలు బాలరిష్టాలు దాటడం లేదు. దీంతో చాలా చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

అసంపూర్తిగా రైతు సేవా కేంద్ర భవన నిర్మాణాలు

ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు మండల పరిధిలో 17, జమ్మలమడుగు మండల పరిధిలో 13, మైలవరం మండల పరిధిలో 13, పెద్దముడియం మండల పరిధిలో 12 కలిపి మొత్తం 55 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలో 32 వేల హెక్టార్లలో రబీ పంటలు సాగు చేస్తున్నారు రైతులు. వేరుశనగ, మినుము, పెసర, నువ్వులు, శనగ, జొన్న, పొద్దుతిరుగుడు, వరి తదితర పంటల సాగులో ఉన్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, సలహాలు, సూచనలతో రైతుల శ్రేయస్సుకోసం ఈ సేవా కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. అయితే ప్రొద్దుటూరు మండల పరిధిలో 17 కేంద్రాల్లో పెద్దశెట్టిపల్లె, ఉప్పరపల్లె, చౌడూరు, కామనూరు, చెన్నమరాజుపల్లె, చౌటపల్లె, దొరసానిపల్లె, సోములవారిపల్లె, గోపవరంలలో ఆర్‌ఎస్‌కే కేంద్రా భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఉప్పరపల్లె, చౌడూరు, చౌటపల్లె, చెన్నమరాజుపల్లెల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లోనే సేవలు అందిస్తున్నారు.

● జమ్మలమడుగు మండల కేంద్రంలో రైతుసేవా కేంద్రాలకు స్థల సమస్య వెంటాడుతోంది. జమ్మలమడుగు, మోరగుడి, కన్నెలూరు ప్రాంతాల్లో స్థల సమస్యతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మిగిలిన కేంద్రాల్లో నూతన భవనాలు పూర్తయినా అవి వినియోగంలోకి రాలేదు.

● పెద్దముడియం మండల పరిధిలో పెద్దపసుపుల పంచాయతీలో 2, నెమళ్లదిన్నె, బీటీపాడు, జంగాలపల్లె, ఉలువలపల్లెల్లో అద్దె భవనాల్లో ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి. మైలవరం మండల పరిధిలో 13 సేవా కేంద్రాలు ఉండగా కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలే తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో కియోస్క్ యంత్రాలు, అసంపూర్తి భవన నిర్మాణాలపై దృష్టి సారించి పూరిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అన్ని యంత్రాలు పనిచేస్తున్నాయి

ఆర్‌ఎస్‌కేలలో అన్ని యంత్రాలు పనిచేస్తున్నాయి. సెల్‌ఫోన్లలో అందుబాటులో ఉన్న యాప్‌ల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ సహాయకులు సేవలు అందిస్తున్నారు. సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం.

\- డి.సురేష్‌రెడ్డి
వ్యవసాయ సహాయ సంచాకులు



కియోస్క్ సేవలు అంతంతే..

రైతు సేవా కేంద్రాల్లో విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతలకు సేవలు అందించాల్సిన కియోస్క్ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రైతు చేతివేళ్ల అనుసంధానించడానికి, రైతులకు అవసరమయ్యే సూచనలు, సలహాలకు యూట్యూబ్ చానెళ్లను వినియోగించి కియోస్క్ యంత్రాల ద్వారా వీడియో ప్రచారం చేయాల్సి ఉంది. కేంద్రాల్లో ఇంటర్నెట్ వసతి అందుబాటులోలేదు. వ్యవసాయ సహాయకులు మాత్రం తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లలో, ట్యాబ్‌లలో సీమేడ్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తూ రైతులకు సేవలు అందిస్తున్నారు. దీంతో లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసినప్పటికి నిరుపయోగంగా ఉన్నాయి.

తాళ్లమాపురంలోని రైతుసేవా కేంద్రంలో ఉన్న కియోస్క్ యంత్రం

జీవో145ను ఉపసంహరించాలి

● పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

కడప రూరల్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈగిల్ (ఫాస్ట్ ట్రాక్ కోర్టు)ను తిరుపతిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు గురువారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన దీక్షలకు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తరలించడం వలన కక్షిదారులు ఎంతో వ్యయప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. కడపలో ఉన్న కోర్టును కడపలోనే కొనసాగించాలని.. కడప నుంచి తిరుపతికి తరలిస్తూ ఇచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం అందె సుబ్రమణ్యం, ఆనందర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీకర్, రాజగోపాల్ రెడ్డి తదితరులు దీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్పనాయుడు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీలు అప్పుల్లో దొందూదొందే..

అప్పుల కుప్పలు చేసి ప్రజలపై బాదుడుకు దిగడంలో వైసీపీ, టీడీపీ దొందు దొందే అని పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం బాదుడు ప్రభుత్వంగా మారిందని మండిపడ్డారు 6 నెలల పాలన కాలంలో అనేక విధాలుగా ప్రజలపై భారం మోపిందన్నారు. అసెంబ్లీ కో- ఆర్డినేటర్ బండి జకరయ్య కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై కొడవలితో దాడి...

కురబలకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులపై కొడవలి, రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. చింతమాకులపల్లె పంచాయతీ అమ్మచెరువు మిట్ట సమీపంలో అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు(32), బసినికొండకు చెందిన అతని సమీప బంధువు గుణశేఖర్ (22)లు బీఏ రాజు ఇంటి సమీపంలో నిలబడి మాట్లాడుతుండగా అనుమానంతో రాజు అతని కుటుంబీకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ యువకులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుణశేఖర్‌ను మెరుగైన చికిత్సల నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29న జూనియర్స్ కబడ్డీ సెలక్షన్స్

కడప స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగర మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ పాఠశాలలో ఈనెల 29న ఆదివారం ఉమ్మడి కడప జిల్లా సబ్‌జూనియర్స్ కబడ్డీ ఎంపికల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.గోవర్ధనరెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో గల కబడ్డీ క్రీడాకారులు తప్పక హాజరై ప్రతిభ చాటాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులు ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో వచ్చే జనవరి 3, 4, 5,6 తేదీల్లో జరగనున్న 28వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వారి తాలుకా ఆధార్‌కార్డు, పదోతరగతి ఒరిజినల్ మార్కు లిస్టు, స్టడీ సర్టిఫికెట్ తప్పక వెంట తీసుకురావాలన్నారు. 20 సంవత్సరాల కేటగిరిలో పాల్గొనే బాలబాలికలు 2005 డిసెంబరు 1న జన్మించిన వారు అర్హులన్నారు. ఇదిలా ఉండగా బాలికలు 65 కేజీలు, బాలురు 70 కేజీల్లోపు ఉండాలన్నారు. ఏదైనా ఇతర వివరాలకు... 9949851059 అనే నెంబరును సంప్రదించాలని కోరారు.

30న శ్రీహరికోటకు ఆర్టీసీ బస్సు

బద్వేలు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో నుంచి శ్రీహరికోటకు ఈనెల 30న బస్సు ఏర్పాటు చేస్తారని ఆర్టీసీ డీఎం కన్యాకుమారి పేర్కొన్నారు. ఇస్రోలో శాస్త్రవేత్తలు ప్రయోగించనున్న రాకెట్‌ను సందర్శించే అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాను పోను టిక్కెట్ ధర రూ.800 ఉంటుందని తెలిపారు. రాకెట్ లాంచింగ్ ముందు పెంచలకోన, సూళ్లూరుపేట చెంగాలమ్మగుడి, పులికాట్ సరస్సులను చూడవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ కోసం విద్యాసంస్థలు రిజిస్ట్రేషన్ కాపీని అందజేయాలని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం పేరు వయస్సు, ఆధార్ కాపీలను పంపాలన్నారు. వివరాల కోసం 9959225779, 7382867104 నెంబర్లను సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

వైవీయూ పరీక్షలు జనవరి 21కి మార్పు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):యోగివేమన యూనివర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు 2025 జనవరి 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ముందుగా డిసెంబరు 30 నుంచి నిర్వహించాలని నిర్ణయించామని అయితే విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని మార్పు చేశామన్నారు. జనవరి 21, 23, 25, 27, 29, 31 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

పులివెందుల సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి

పులివెందుల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్ జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు., అనంతరం జైలు పరిసరాలు, వంట గదులను, వసతి గదులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ వీఆర్‌కు..

కొండాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండాపురంలో సీఐ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాయుడును వీఆర్‌కు పంపినట్లు సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. కానిస్టేబుల్ రాయుడు ఫోన్‌లో లైంగికంగా వేధిస్తున్నాడని ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి.. ఆయనను వీఆర్‌కు పంపారు. ప్రస్తుతం రాయుడుపై విచారణ జరుగుతోందని సీఐ తెలిపారు.

పాఠశాలకు వాటర్‌ప్లాంటు వితరణ



ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న వైవీయూ మాజీ వీసీ సూర్యకళావతి

కమలాపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తన తండ్రితో పాటు తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో సుమారు రూ.6లక్షల విలువజేసే వాటర్ ప్లాంట్ వితరణగా అందించినట్లు మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లెకు చెందిన శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం అయన పెద్దచెప్పలి జిల్లా పరిషత్ హైస్కూలులో తన తండ్రి జనార్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ప్లాంటును యోగి వేమన యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ సూర్యకళావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివిద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ విద్యా సలహాదారుడు సాంబశివారెడ్డి, ఎంఈఓ సుభాషిణి, చంద్రకాంత్‌రెడ్డి, డాక్టర్ మాధవి, ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్లు పుల్లారెడ్డి, మైసూరారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారతదేశం విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని.. కడప సంస్కృతి ఎంతో గొప్పదని యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం యోగివేమన యూనివర్సిటీ ప్రాంగణంలో భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ విశాఖపట్టణానికి చెందిన యువత కడప జిల్లా చరిత్రను, విశిష్టతను తెలుసుకునేందుకు ఇక్కడకి రావడం అభినందనీయమన్నారు. డిసెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలను యువత సందర్శిస్తారని అన్నారు. ఇతర ప్రాంతాలలోని వారసత్వ కట్టడాలను చూడడం ద్వారా సమాజంపైన యువతకు ఒక అవగాహన ఏర్పడుతుందన్నారు. సమాజంలో ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ మాట్లాడుతూ సంస్కృతిక సాంప్రదాయాల కోసం ప్రత్యేకంగా ఇలాంటి వేదికలు రూపొందించినపుడు ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని యువతకు పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కడప అంటే బాంబుల గడ్డ కాదు కవులకు నిలయం అన్నారు. కార్యక్రమంలో వైవీయూ ఎన్ఎస్ఎస్ లక్ష్మి, నెహ్రూ యువకేంద్ర అకౌంట్స్ ఆఫీసర్ బాబురెడ్డి, సిబ్బంది, జాతీయ సేవ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు - బైకు ఢీ... వ్యక్తి మృతి



సింహాద్రిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అగ్రహారం గ్రామ సమీపాన సింహాద్రిపురం-పులివెందుల రోడ్డులో కారు-మోటారు బైకు ఢీకొన్న ప్రమాదంలో కొమ్మా నీలకంఠారెడ్డి(65) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ తులసీనాగప్రసాద్ సమాచారం మేరకు... కసనూరు గ్రామానికి చెందిన నీలకంఠారెడ్డి బైకుపై వస్తుండగా సింహాద్రిపురం నుంచి పులివెందుల వైపు వెళ్లే కారు ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతునికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుర్లు కలరు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జమ్మలమడుగు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నాగులకట్టవీధిలో రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో దూదేకుల మనోహర్ (41) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. నాగులకట్ట వీధికి చెందినమనోహర్‌ను భార్య విడిచిపెట్టి వెళ్లిపోవడంతో గత కొన్ని నెలలుగా పట్టణంలో తిరుగుతూ.. వీధుల్లో ప్లాస్టిక్ బాటిళ్ల తదితర వస్తువులు తీసుకుని ప్లాస్టిక్‌వ్యాపారుల వద్ద విక్రయించేవాడు. అయితే ఉన్నట్లుండి బైపాస్ రోడ్డు పక్కన అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అర్బన్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ కింద పడి మహిళ మృతి



రామలక్షుమ్మ(ఫైల్)

సిద్దవటం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె శనీశ్వర గుడి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో రామలక్షుమ్మ (55) మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గురువారం ఉదయం అట్లూరు మండలం కమలకూరు గ్రామం నుంచి రామక్రిష్ణారెడ్డి, రామలక్షుమ్మ(55) ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతున్నారు. కనుమలోపల్లె శనీశ్వర గుడి సమీపానికి రాగానే వర్షానికి ద్విచ క్రవాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. అదే సమయంలో కర్నూలు నుంచి చెన్నైకు వెళుతున్న లారీ కింద వెనుక వైపు కూర్చు న్న రామలక్షుమ్మ పడటంతో మృతి చెందింది. శవ పంచనామా నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమో దు చేసినట్లు ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలియజేశారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

● తప్పిన ప్రమాదం

సికెదిన్నె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో ఆగి ఉన్న కారును లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదని సీకెదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు కడప నుంచి రాయచోటివైపు వెళుతున్న కారు మూడవ మలుపు వద్ద ఆగి ఆంజనేయస్వామి గుడిలోకి వెళ్లి దర్శనం చేసుకుంటుండగా అదే సమయంలో రాయచోటి వైపు నుంచి ఘాట్ దిగుతున్న లారీ అదుపు తప్పి కారుపైకి దూసుకొచ్చి మట్టికట్టపైకి ఎక్కి ఆగిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని గొర్రెలు మృతి

ముద్దనూరు డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కడప తాడిపత్రి హైవే రోడ్డులోని ఓబులాపురం గ్రామం వద్ద గురువారం రాత్రి గొర్రెల మందపై టిప్పర్ దూసుకెళ్లడంతో ఓబులాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గనేష్‌కు చెందిన 10 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి గనేష్ సమాచారం మేరకు.. గొర్రెల మందను మేతకోసం కొండకు తోలుకెళ్లి తిరిగి ఓబులాపురం గ్రామం వస్తుండగా కొండాపురం వైపు టిప్పర్ అతివేగంగా రోడ్డు పక్కన వెళుతున్న గొర్రెల మందపైకి దూసుకు వచ్చింది. దీంతో దాదాపు 10 గొర్రెలు మృతి చెందాయి. టిప్పర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లాడాని, దాదాపు రెండు కిలోమీటర్ల వద్ద టిప్పర్‌ను నిలిపామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు గొర్రెల కాపరి తెలిపారు.

విద్యార్థినిపట్ల అనుచిత ప్రవర్తన

పోరుమామిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఉపాధ్యాయుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు జోక్యం చేసుకుని సమస్యను సర్దుబాటు చేశారు. కాగా జరిగిన విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. వివరాల్లోకెళితే... పోరుమామిళ్ల మండలంలోని ఓ జిల్లా పరిషత్తు హైస్కూలులో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై హిందీ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఆ విషయం ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలపడంతో వారు గురువారం స్కూలు వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు అతనిపై ఎక్కడ దాడి చేస్తారోనని భావించి ముందుగానే ఓ తరగతిగదిలో ఉంచి నట్లు తెలిసింది. వెంటనే వారు రెవెన్యూ సదస్సులో తహ సీల్దార్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఉపాధ్యాయుడు పాఠశాలను వదిలి వెళ్లిపోవాలని, మళ్లీ వస్తే సహించేది లేదని గ్రామస్థులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయమై ఎంఈఓ అంకిరెడ్డిని వివరణ కోరగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అక్కడ జరిగిన విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గతంలో కూడా ఆ ఉపాధ్యా యుడిపై ఫిర్యాదులు అందాయని, జరిగిన విషయాలను డిప్యూటీ డీఈఓ దృష్టికి తీసుకువెళుతున్నట్లు ఆయన తెలిపారు.


ఇరువర్గాల ఘర్షణ

యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతబోలు గ్రామంలోని వంగాడవారిపల్లెలో గురువారం భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ పడ్డారు. వంగాడవారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు సతీష్(28) అదే గ్రామానికి చెందిన శివకుమార్‌లు పొలం దున్నకం గురించి గొడవపడ్డారు. దీంతో శివకుమార్ ఆవేశంతో సతీష్‌పై కొడవలితో దాడి చేసి గాయపర్చారు. గాయపడిన బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

కారు ఢీ.. మహిళ మృతి

అట్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో సంగటి సుబ్బమ్మ(70) దుర్మరణం చెందింది. లింగాల కుంట వాసి సుబ్బమ్మ లింగాల కుంట వద్ద రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఢీకొన్న కారులో బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. కారు పెనగలూరు ఎంపీడీఓకు చెందినదిగా స్థానికులు గుర్తించారు.



30న కలెక్టరేట్ వద్ద ధర్నా

● వామపక్ష నేతల పిలుపు

రాయచోటిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని కోరుతూ ఈ నెల 30న వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు విశ్వనాథ్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్రమ్మలు పిలుపునిచ్చారు. గురువారం వారు స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని మహిళలను, రైతులను, విద్యార్థులను ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంలో కూటమి ప్రభుత్వం ముందు వరుసలో ఉందని విమర్శించారు.

4న రంగనాథస్వామి కల్యాణం

నందలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య రాజంపేట అండాల్ భక్తసేవా సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత ప్రసన్న రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం జనవరి 4న శనివారం ఉదయం రాజంపేట బైపాస్ రోడ్డులోని కళాంజలి గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సౌమ్యనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. భక్తాదులు స్వామివారి కల్యాణం తిలకించి కార్యక్రమం జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

శ్రమజీవుల పక్షాన నిరంతర పోరాటం

● సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు



రాయచోటిలో.. సీపీఐ శత వార్షికోత్సవాల జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రాజంపేటలో.. సీపీఐ పతాకం ఎగురవేస్తున్న నాయకులు మహేష్, శివరామకృష్ణదేవర, కార్మికులు

రాయచోటిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రమజీవుల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి గేటు సమీపంలో జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నిర్బంధంలో పుట్టి పెరిగిన పార్టీ అని, దున్నే వారిదే భూమి అనే నినాదంతో భూపోరాటం చేసి వేలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేసినట్లు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మర్రి సుమిత్ర, కోటేశ్వరరావు, సుధీర్‌కుమార్, జిల్లా సమితి సభ్యులు వెంకటేశ్, రంగారెడ్డి, వెంకటరమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి జగన్, బాబు, ఆంజనేయులు, మహిళా సమాఖ్య నాయకురాలు ప్రమీల పాల్గొన్నారు.

రాజంపేట: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సమితి కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవర ఆధ్వర్యంలో సీపీఐ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా అనేకమంది ఎర్రజెండా నీడలో పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సికిందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర, పి.సుబ్రమణ్యం, సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, శివయ్య, వెంకటసుబ్బయ్య, రమణ, ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: సీపీఐ ఆవిర్భావ వేడుకలు గురువారం లక్కిరెడ్డిపల్లెలో మూడు రోడ్ల కూడలిలో సీపీఐ నాయకుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు జెండాను ఆవిష్కరించి ఘనంగా వేడుకలు నిర్వహించారు.

గాలివీడు: సీపీఐ ఆవిర్భావ వేడుకలు గాలివీడులో సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

సుండుపల్లె: పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు విశ్వనాథ్ నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద సీపీఐ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని దళవాయిపల్లెలో గురువారం సీపీఐ శతజయంతి ఉత్సవాలను మండల కార్యదర్శి సెల్వంకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు లక్ష్మీదేవి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికల్లో న్యాయం చేయండి

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో రాజంపేట ఇన్‌చార్జికి అవకాశం లేకుండా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కుట్రలు చేస్తున్నారని దాదాపు 100 మంది ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్‌వోకు గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పించా నీటి సంఘాల ఎన్నికల్లో 6 మంది టీసీ సభ్యులు ఉన్నారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సంఘాల ఎన్నికల్లో న్యాయం చేయాలని డీఆర్‌వోకు విన్నవించారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సుండుపల్లె వాసులు

ఘనంగా ఎన్ఎస్ఎస్ ప్రారంభోత్సవ సభ

ఒంటిమిట్ట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో చిన్నకొత్తపల్లె గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రావేప్ ప్రోగ్రాంలో భాగంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఆర్‌కే అంకయ్యకుమార్ విచ్చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా చేయాల్సిన పనుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ గైడర్ శాంతి, డాక్టర్ వాణి, ఏకశిల సేంద్రియ వ్యవసాయ చైర్మన్ సుబ్బరాయుడు, గంగపేరూరు చెరువు చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఏపీవోగా మృత్యుంజయనాయుడు



రైల్వేకోడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల ఉపాధిహామీ పథకం ఏపీవోగా మృత్యుంజయ నాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి జిల్లా బాలాయపల్లె మండల ఏపీవోగా పనిచేసి అక్కడి నుంచి రైల్వేకోడూరుకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనులు వేగవంతంగా సాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సర్పంచ్ తండ్రి మృతి

● నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

సంబేపల్లె, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె సర్పంచ్ అంచల రామచంద్ర తండ్రి వెంకట్రమణ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి గురువారం వారి స్వగ్రామమైన బొగ్గులవారిపల్లెలో భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోర్ల ఉపేంద్రారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ రవీంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

పుల్లంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవరకొండ గుట్ట వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం దేవరకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పెంచలకోన 6వ మహాపాదయాత్ర సందర్భంగా ఈ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో వందలాది మంది లక్ష్మీనరసింహస్వామి మాలలు ధరించారు. కల్యాణానికి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి భక్తులకు పందిళ్లు వేసి అందంగా అలంకరించారు. మేళతాళాల మధ్య వేదపండితులు, మంత్రోచ్చరణ చేస్తుండగా ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదికపైకి తీసుకొచ్చి శాశ్వతంగా కల్యాణాన్ని నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని కనులారా వీక్షించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ధనికుల భవంతులు తొలగించాలి

● గాంధీ విగ్రహం ముందు సీపీఐ నాయకుల నిరసన



గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, బాధితులు

గాలివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ నిరుపేదల రేకుల షెడ్లు తొలగించినట్లే ధనికుల భవంతులు కూడా తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి పట్టణంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నెంబరు 2266లో వివాదాస్పదమైన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీలో అక్రమ నిర్మాణాలు చేశారని నిరుపేదల గుడిసెలు గంటల వ్యవధిలోనే తొలగించిన అధికారులు.. అదేచోట ఉన్న ధనవంతుల భవనాలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. వెంటనే కలెక్టర్ స్పందించి ధనవంతుల భవనాలు కూడా తొలగించి మొత్తం 1.80 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జక్కుల వెంకటేశ్, సీపీఐ నాయకులు పురం కృష్ణమూర్తి, భాస్కర్‌యాదవ్, అంజి, జగన్‌బాబు, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో.. వీరబాల దివస్

రాజంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీబీఎస్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో వీరబాల దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు గురువారం మాట్లాడుతూ 1704 డిసెంబరు 26న పదో గురువు గురుగోవింద్ సిబంగ్, జోరావర్‌సింగ్, పతేసింగ్‌లను బతికుండగానే సజీవ సమాధి చేసిన మొగలాయుల దురాక్రమణకు నిదర్శనమన్నారు. అందువల్ల ప్రతి యేటా వీరబాల దివాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీహరిప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, ఎం.స్వర్ణలత పాల్గొన్నారు.

చేసే పనులను బట్టే ఫలితాలు : వెంకటరమణ

రాజంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ గుణాలను అనుసరించి పనులను నిర్వర్తిస్తారని, వారు నిర్వహించిన పనులను బట్టే ఫలితాలు ఉంటాయని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండు ఎర్రబల్లె కోదండ రామాలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మికోపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు, ఆలయ ధర్మకర్త ఉల్లంగి నాగరాజు, మడితీపి నరసింహ, పీవీ నరసయ్య, కేతినేని వెంకటక్రిష్ణయ్య, పిచ్చిరాజు, పంతులు బాబు, పబ్బులేటి సరస్వతమ్మ, జక్కాల ఇందిరమ్మ, మలరాజు రమణమ్మ, ఆలయ పూజారులు శర్మ, కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కమిటీ ఎన్నిక



ఐక్యత చాటుకున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో గురువారం ఏపీ రైతు సంఘం రాయచోటి నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడిగా వడ్డమూడి హరినాథనాయుడు, ప్రధాన కార్యదర్శి యండపల్లి బాలకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి సుధాకర్, ప్రచార కార్యదర్శి పాలగిరి వరీద్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి జరగాల లక్ష్మిరెడ్డి, తదితర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడారు.

దుకాణాల్లో పోలీసుల తనిఖీ



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్దవటం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం గ్రామంలో గురువారం రాత్రి స్థానిక పోలీసులు దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఓపెన్ డ్రింకింగ్ కార్యక్రమంలో భాగంగా మండల ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్ ఆదేశాలతో దుకాణాల్లో ఓపెన్ డ్రింకింగ్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టామని, బహిరంగ ప్రదేశాల్లో దుకాణంలో మద్యం సేవించకూడదన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి ఏర్పాట్లు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పిల్లల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ఎంఈవో చక్రేనాయక్ పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే దాత పాపులర్ షూమార్ట్ ఓనర్ హరినాథరెడ్డి అందజేసిన 30 దుప్పట్లను ఎంఈవో చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాలుర ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి, పాఠశాల ఐఆర్టీ ఉపాధ్యాయుడు మనోహర్, యాజమాన్య కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, దివ్యాంగుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతో ఆలయానికి రోడ్డు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

సుండుపల్లె, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని పెద్దబలిజపల్లెలో సంక్రాంతి పండుగ నిర్వహించుకునే కాటమరాజు ఆలయం (చిట్లాకుప్ప) దగ్గరకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు తెలిపారు. గ్రామస్తులు ఎంతో సంబరంతో సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించుకుంటారని, సరైన రోడ్డు వసతి లేక రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి మండల నిధులతో రోడ్డు పనులు ప్రారంభిస్తున్నామన్నారు. సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నంద్యాల రామయ్య, శివశంకర్, నంద్యాల సిద్ద, రెడ్డిచర్ల నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సుండుపల్లె, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2025 జనవరి 2వ తేది సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను క్లస్టర్ పరిధిలోని అంగన్వాడీ కార్యాలయంలో ఇవ్వాలని కోరారు. చిన్నగొల్లపల్లి (ఓసీ), మాన్యంవారిపల్లె (ఎస్టీ), దిగువపల్లె (ఓసీ), వినాయకనగర్ (ఈడబ్ల్యుఎస్) ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, స్థానికులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రంగా వర్ధంతి వేడుకలు



రంగా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

రైల్వేకోడూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీక్రిష్ణదేవరాయుల విగ్రహం వద్ద గురువారం దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి వేడుకలు రైల్వేకోడూరులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చెన్నంశెట్టి చలపతి ఆధ్వర్యంలో రంగా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు మందల నాగేంద్ర, నార్జాల హేమరాజ్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, రంగా యువసేన అధ్యక్షుడు శ్రీకారపు మస్తాన్, సభ్యులు కటికం సుబ్రహ్మణ్యం, శోడిశెట్టి మణి, ఉత్తరాది శివకుమార్, వాసాబాబు, చిన్నా, నార్జాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈక్రాప్ చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

చిన్నమండెం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. మండలంలోని దిగువ గొట్టివీడు రైతు సేవా కేంద్రం పరిధిలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఈ పంట నమోదును పర్యవేక్షించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా ఈపంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం తయారీపై అవగాహన

సుండుపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్రవ జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించినట్లు ఐసీఆర్‌పీ హస్సేన్ గురువారం తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని సిద్దారెడ్డిగారిపల్లెలో సాగు చేసిన కూరగాయల పంటలను వారు పరిశీలించారు. ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని డెమో ద్వారా చూపించారు. 20 సెంట్లు సాగుచేసిన కూరగాయల తోటలో 365 రోజులు ఆదాయం వస్తుందని తెలియజేశారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంటి తిమ్మప్ప, డీఎంఎంటీలు రామాంజనేయులు, వీరనాగయ్య, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటపై పందుల దాడి



పందుల దాడిలో దెబ్బతిన్న వేరుశనగ పంట

సుండుపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భగంపల్లి గ్రామ పంచాయతీ కుంటలముంద రలో రైతు నాగిరెడ్డి సాగు చేసిన వేరుశనగ పొలంలో బుధవారం రాత్రి అడవి పందులు దాడి చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు ఎకరాల వేరుశనగ సాగు చేశామని, సుమారు 35 కుంటల వరకు పందుల దాడి కారణంగా నష్టం జరిగిందన్నారు. పందుల బెడద కారణంగా ప్రతిసారి పంటలు సాగు చేసినప్పుడు నష్టం చవి చూస్తున్నామని, వాటి బారి నుంచి కాపాడాలని అధికారులను కోరారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

- వైసీపీ ప్రభుత్వంలో దక్కని బీమా
- ఈ-క్రాప్‌లో తప్పుల తడకతో నష్టం
- ఈ ప్రభుత్వమైనా పాత పద్ధతిని పూర్తి స్థాయిలో అమలు చేసేనా ?

పంటల బీమా.. రైతుకు ధీమాగా నిలిచేనా?

పులివెందుల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకం రైతులకు భరోసా ఇవ్వడం లేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ-క్రాప్ విధానం తప్పులతడకగా ఉండటంతో తమకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతూ వచ్చారు. పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని నాటి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే.. ఆ మేరకు ఒక్క ఏడాది కూడా రైతులకు పంటల బీమా సక్రమంగా అందలేదు. కూటమి ప్రభుత్వం అయినా పాతపద్ధతినే పూర్తి స్థాయిలో అమలుచేసి రైతుకు ధీమానిస్తుందా లేక వైసీపీ పద్ధతినే అవలంబిస్తుందో తెలియాల్సిఉంది.

పంట సాగుచేసేందుకు రైతులు బ్యాంకుల్లో ప్రతి ఏడాదిపంట రుణాలు తీసుకుంటారు. తీసుకునే సమయంలోనే ఏ పంటకు రుణాలు తీసుకుంటున్నారో దానికి సంబంధించి బీమా ప్రీమియం బ్యాంకుకు చెల్లిస్తారు. బ్యాంకుల్లో రుణాలు పొందని రైతులు నేరుగా మీసేవ ద్వారా లేదా ప్రైవేట్ సంస్థల ద్వారా ప్రీమియం చెల్లించి బీమా చేసుకుంటారు. ఇది వైసీపీ ప్రభుత్వం రాకమునుపు సాగుతున్న తంతు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి పంటలకు సంబంధించిన ప్రీమియం వసూలుచేయవద్దని ప్రభుత్వమే చెల్లిస్తుందని బ్యాంకులకు ఆదేశాలిచ్చింది. దీనితో బ్యాంకులు ప్రీమియం వసూలు చేయకుండా కేవలం తీసుకున్న పంట రుణాలకు రెన్యువల్ చేసుకుని వడ్డీ వసూలు చేయడంతోనే సరిపెడుతూ వచ్చారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రీమియం సక్రమంగా చెల్లించకపోవడంతో పంటనష్టపోయిన సమయంలో పరిహారం అందక రైతులు నష్టపోయారు. ఇటు కడప జిల్లా అటు అన్నమయ్య జిల్లా రైతాంగం కరువు కాటకాలతో అల్లాడుతూంటారు. గత నాలుగైదేళ్లుగా పంటల దిగుబడి చూస్తే ఏ ఒక్క ఏడాది కూడా రైతులకు లాభాలు చేకూరింది లేదు. వర్షాలు కూడా సాగు చేయడానికి వీలుగా అనువైన సమయంలో కురవడం లేదు. పదును దాటాక కురిసిన వర్షానికి పంట సాగుచేస్తే గింజ మొలకెత్తి ఏపుగా పెరిగినా.. కాతకాసే సమయానికి లేదా పంట ఒబ్బిడి చేసే వేళకు వర్షాలు రాక పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆ పంటలకు బీమా చేసి ఉంటే ప్రభుత్వం ఆ మేరకు సొమ్మును ఇచ్చి రైతులను ఆదుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రైతులు సాగుచేసిన పంటలకు ప్రీమయం చెల్లించలేదు. రైతులు చెల్లించవద్దని తామే చెల్లిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఇ-క్రాప్ విధానంతో బీమా పరిహారం అందిస్తామని చెప్పింది. అయితే ఈ ఏడాది కూడా రైతు సాగుచేసిన పంటలన్నిటికి పూర్తిస్థాయిలో పరిహారం దక్కలేదు. కంటితుడుపు చర్యగా బీమా పరిహారం చెల్లించారు. ఒక్క రైతు పది ఎకరాల పంట సాగుచేస్తే మూడు, నాలుగు ఎకరాలు సాగుచేసినట్లు ఇ-క్రాప్‌లో నమోదు చేశారు. దీంతో ఆ మూడునాలుగు ఎకరాలకు అరకొర పరిహారం ప్రభుత్వం విదిల్చేది. పంట సాగుచేసినా ఏ పంట వేశారనే వివరాలు కూడా ఈ-క్రాప్‌లో లేకపోవడంతో ఆ రైతులకు మరింత నష్టాలనే మిగిల్చింది.



పులివెందుల ప్రాంతంలో సాగులో ఉన్న శనగ

ఫసల్ బీమా తొలగించడంతో తీవ్ర నష్టం

ముఖ్యంగా రైతులు ఖరీఫ్‌లో పంటల సాగుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని అదే సమయంలో ఆ పంటకు ఫసల్ బీమాకోసం ప్రీమియం కూడా చెల్లిస్తారు. ఫసల్ బీమాలో రైతులకు ఎంతో వెసులుబాటు ఉండేది. ఫసల్ బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటే పంట సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి వర్షాలు పడక పంట సాగుకాకపోయినా కొంత మొత్తం రైతులకు దక్కుతుంది. అంటే పంట సాగుచేసి పంటల మధ్యకాలంలో వర్షాలు కురవక పంట ఎండిపోతేనే బీమా వస్తుందన్నది వాతావరణ బీమా పద్ధతి. కానీ పంట సాగుసమయంలో వర్షాలు కురవక పోయినా ప్రకృతి వైపరీత్యమే అని కేంద్ర ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రీమియం తామే చెల్లిస్తామని ప్రకటించి పాత పద్ధతిని పూర్తిగా తొలగించింది. దీంతో ఏ పంటకు రుణాలు తీసుకోవాలో, ఏ పంటకు ప్రీమియం చెల్లించాలో రైతులకు అర్థం కాకుండా మారిపోయింది. దీనికి తగ్గట్టే వైసీపీ ప్రభుత్వంలో రైతులకు పంటల బీమా సక్రమంగా అందలేదు.

ఈ ప్రభుత్వమైనా ధీమానిస్తుందా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత పద్ధతిలోనే పంటల బీమా అమలు చేస్తామని ప్రకటించింది. కానీ దానికి ఈ-క్రాప్ లింకప్ చేస్తామనడంతో రైతులు ఈ ప్రభుత్వం కూడా వైసీపీ ప్రభుత్వంలాగా చేస్తుందేమోనని అనుమానిస్తున్నారు. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే సమయంలోనే ఆ పంటకు ప్రీమియం తీసుకునే పరిస్థితి ఉంటే ఈ-క్రాప్ పద్ధతి ఎలా కుదురుతుందని ప్రశ్నిస్తున్నారు.

పంట సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వర్షాలు కురవక పంటే సాగుకాకపోతే ఈ-క్రాప్ ఎక్కడి నుంచి తేవాలని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ-క్రాప్ పద్ధతి పూర్తిగా పక్కన పెట్టేయాలని రైతులు కోరుతున్నారు. రైతులు సాగుచేసిన పంటకు ప్రీమియం చెలిస్తే నష్టం జరిగిందా లేదా అని గుర్తించి బీమా ఇస్తే రైతులకు కాస్తోకూస్తో భరోసా దక్కుతుంది. 2014-2019లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పంటల బీమాకు సంబంధించి ఎలాంటి విధానాలు అమలు చేసిందో అదే పద్ధతిని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పులివెందులలో సాగులో ఉన్న కంది పంట

హత్య కేసులో నిందితుల అరెస్ట్ : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

గాలివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కళాకారుడు సత్యన్న హత్య కేసులో నిందితులైన వెంకటరమణారెడ్డి, అతడి కుమారులైన శివ శంకర్‌రెడ్డి, రామాంజులరెడ్డిలను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లె గ్రామ కస్పాలో పెద్ద కర్మ సందర్భంగా కీచకవధ వీధి నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి కీచకుడి పాత్ర పోషించగా తలారి పాత్రను సత్యన్న అలియాస్ వెంకటరమణ పోషించారు. నాటకం ప్రదర్శించే సందర్భంలో ఇరువురి మధ్య మనస్పర్థల కారణంగా గొడవ మొదలైంది. ఈ గొడవ విషయంలో గ్రామంలో ఉన్న పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పినా వినకుండా నాటకం మధ్యలోనే ఆపివేశారు. ఈ క్రమంలో సత్యన్న, రమణారెడ్డిలు తిరుగు ప్రయాణమై బోరెడ్డిగారిపల్లె బస్టాప్ వద్దకు రాగానే వెంకట్రమణారెడ్డి సత్యన్న తలపై బండరాయితో బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వెంకటరమణారెడ్డి తన కుమారులకు ఫోన్ చేసి సంఘటనాస్థలానికి పిలిపించుకుని తన సొంత ఆటోలో సత్యన్న మృతదేహాన్ని వేసుకుని సమీపంలోని మంగళపల్లి గుట్ట వద్ద పడవేసినట్లు, ఈ హత్యను తామే చేసినట్లు నిందితులు డీఎస్పీ ఎదుట అంగీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణలను అభినందించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతదేహం, పవన్‌కుమార్ (ఫైల్)

గాలివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలివీడు, కోనంపేట ప్రధాన రహదారిలో ఆటో ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో కోట్లపల్లి పవన్‌కుమార్ (18) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లె గ్రామం హరిజనవాడకు చెందిన పవన్‌కుమార్ గాలివీడు పంచాయతీ హరిజనవాడలో తన సోదరి ఇంటికి వచ్చి తిరుగు పయనమయ్యాడు. నూలివీడు, లక్కిరెడ్డిపల్లె సమీపంలోకి రాగానే లక్కిరెడ్డిపల్లె నుంచి గాలివీడుకు వస్తున్న ఆటో.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పవన్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. అదే మార్గంలో వస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ ప్రమాద స్థలంలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడిని వారి వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘాట్‌లో రక్షణ గోడను ఢీకొట్టిన లారీ



రామాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు ఘాట్ 2వ మలుపు వద్ద గురువారం సిమెంటు లారీ అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొని ఆగిపోయింది. ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డారు. రక్షణగోడ లేకుంటే 50 అడుగుల లోతు లోయలో సిమెంటుతో సహా లారీ పడిపోయేది. చిరుజల్లులు కురుస్తుండడం, రోడ్డుపై తేమ ఉండడంతో టైర్లు, రోడ్డు గ్రిప్పు కోల్పోవడం వల్లే మలుపులో ఘాటు దిగుతూ ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది.

'సూర్య ఘర్'పై అవగాహన కల్పించాలి

- ఎస్ఈ రమణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

పీలేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై విద్యుత్ వినియోగులకు విస్తృత అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ రమణ పీలేరు డివిజన్‌లో విద్యుత్ ఉద్యోగులను ఆదేశించారు. పీలేరు డివిజన్ ప్రగతిపై గురువారం ఆయన స్థానిక ఈఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన ద్వారా రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్‌లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తోందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి అతి తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణాలు అందిస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వినియోగదారులను చైతన్యపరచాలని ఆయన తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు లోవోల్టేజ్ సమస్యను అధిగమించాలని, అందుకు నెలకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల చొప్పున నిర్వహణ పనులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర రెడ్డి, డీఈలు అమీర్‌బాషా, శివయ్య, పీలేరు, కేవీపల్లె, కలికిరి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల ఏఈలు, జేఈలు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో...

కలకడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు పీఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా సబ్సిడీతో ఏర్పాటు చేయనున్న సోలార్ రూఫ్‌టాప్‌ను వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ కోరారు. కలకడ మండలం కె.కొత్తపల్లెలో జరుగుతున్న అర్హుల గుర్తింపు నమోదును గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినియోగదారులు తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్‌కు ఒక యూనిట్‌కు రూ.2.30 పైసలు తిరిగి పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ శివయ్య, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

మామిడి రైతు గుల్ల

- మూడు రోజులుగా ముసురు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆందోళనలో మామిడి రైతులు

రైల్వేకోడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా పడుతున్న ముసురు వర్షంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షంతో మామిడికి పూతలు వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా వచ్చిన పూతలు కూడా ఈ వర్షంతో మాడిపోయాయి. కొన్ని తోటల్లో వర్షం దెబ్బకు పూర్తిగా పూత రాలిపోయింది. దీంతో మామిడి రైతు గుల్ల అయ్యాడు. మూడు రోజులుగా తుఫాన్ కారణంగా ముసురు వర్షం పట్టింది. ఇప్పటికే పలు దఫాలుగా భారీ వర్షాలు కురవడంతో మామిడి రైతులు ఆందోళనలో పడ్డారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో ఎక్కువగా మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో మామిడి సుమారు 20 వేల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. మామిడికి పూత దశలో వర్షం కురిస్తే మాడిపోతుంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడికి ముందస్తుగానే పూతలు వచ్చాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే తుఫాన్ కారణంగా పలు దఫాలుగా వర్షాలు కురవడంతో వచ్చిన పూతలు రాలిపోవడంతో పాటు మగ్గిపోయాయి. మామిడి రైతులకు ఈ వర్షాలు శాపంలా మారాయని వాపోతున్నారు. వర్షాలు కురిసి ఆగిపోయిన తర్వాత ఒకవేళ నిలిచినా వచ్చిన కాయలకు మంగు ఏర్పడుతుందని వ్యాపారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మామిడి తోటల్లో ఇప్పటికీ పూతలు రాలేదు. ఇప్పటికే రైతులు మామిడి తోటలకు మందులు పిచికారీ చేసి ఉన్నారు. దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశారు. గత ఏడాదిలో దిగుబడులు 20 శాతం వచ్చాయి. ఈ ఏడాది 5 శాతం కూడా దిగుబడులు వచ్చేలా లేవని రైతులు వాపోతున్నారు. రైతులు మామిడి తోటల దున్నకాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వ్యాపారుల నుంచి డబ్బులు ముందస్తుగా తీసుకున్నారు. తీసుకున్న రుణాలకు వడ్డీలు వచ్చే ఏడాదికి వడ్డీలు పెరుగుతాయి. దిగుబడులు బాగా వస్తే ఇచ్చిన రుణాలు తీరిపోయి డబ్బులు మిగులుతాయని రైతులు అంటున్నారు. భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో పూతలు త్వరగా వస్తాయన్న నమ్మకం రైతుల్లో లేదు. వర్షాలు పూర్తిగా ఆగిపోయిన తర్వాత మళ్లీ మందులు పిచికారీ చేస్తే పూతలు వచ్చినా కాయలు కోతకు ఆలస్యం అవుతుందని వ్యాపారులు అంటున్నారు. రైల్వేకోడూరు మామిడి కాయల కంటే ముందస్తుగా విజయవాడ, బంగారుపాళెం, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాలకు చెందిన మామిడి కాయలు మార్కెట్‌లోకి ప్రతి ఏడాది వస్తాయి. దీంతో రైల్వేకోడూరు మామిడి కాయలకు డిమాండ్ పెద్దగా ఉండకపోవచ్చునని పలువురు రైతులు అంటున్నారు. ఇదే వర్షాలు అక్కడ కూడా ఉంటే అన్ని ప్రాంతాలకు చెందిన మామిడి కాయలు ఒకేసారి ఆలస్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. మొత్తానికి వర్షాలు రైల్వేకోడూరును వీడడం లేదు. మూడు రోజులుగా తుంపరతో మొదలైన ముసురు వర్షం పట్టిపీడిస్తోంది. వర్షాలు పూర్తి స్థాయిలో తగ్గిపోయి ఎండ బాగా కాస్తే మామిడికి పూతలు వచ్చే అవకాశాలు ఉంటాయని శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖాధికారులు అంటున్నారు.



పూతరాని మామిడి చెట్లు



రైల్వేకోడూరు లో కురుస్తున్న వర్షం



రైల్వేకోడూరులో కమ్ముకున్న మేఘాలు

మామిడికి వర్షం దెబ్బ



మామిడికి వర్షం దెబ్బపడింది. ముందస్తుగా వచ్చిన పూతలు రాలిపోయాయి. కొన్ని తోటల్లో మగ్గిపోయినాయి. దీంతో రైతులు అల్లాడుతున్నారు. ఉమ్మకాపుతో కొందరు రైతులు కోలుకున్నారు. బేనీషా, తోతాపూరి, నీలం, మాల్గోవా, చెరుకు రసం, ఖాదర్, మల్లిక, రుమాణి, పులిహోరా తదతర రకాల మామిడి కాయలకు మంచి డిమాండు ఉంటుంది. అయితే వర్షం దెబ్బకు మామిడి రైతులు డీలా పడ్డారు. వరుణ దేవుడు కురుణించి మామిడి రైతులను కాపాడాలి.

- కస్తూరి రామచంద్రయ్యనాయుడు, రైల్వేకోడూరు మామిడి రైతు

మామిడి సాగుకు ఖర్చు అధికం



మామిడి సాగుకు ఖర్చు ఎక్కువగా ఉంది. ఇది రైతులకు ప్రతి ఏటా భారంగా మారింది. దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రతి ఏటా కాయలకు మంగు వస్తోంది. దీంతో మార్కెట్లోకి కాయలు పోవడం లేదు. వర్షంతో కాయలకు మచ్చపడుతోంది. చాలామంది రైతులు వేపనూనెను పిచికారీ చేయడంతో చాలా మంది రైతుల తోటలకు మేలు కలగడమే కాకుండా పూతలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

- సాదు చంద్రపాల్, మైసూరివారిపల్లె, మామిడి రైతు, వ్యాపారి

వైద్య సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాగరాజు

సిద్దవటం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదిన్‌సాహెబ్‌పల్లె పాఠశాలలో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమాన్ని కడప డీఎంహెచ్‌వో నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అంగన్వాడీ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతులుగా ఉండేలా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కడప-చెన్నై జాతీయ రహదారి మాధవరం, ఉప్పరపల్లె పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె ప్రాంతాల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రజలకు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. 104 వైద్యసేవలు ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్ రమణయ్య, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య మృతి



రైల్వేకోడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేడ్కర్‌నగర్ వాసి 11వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 1995వ బ్యాచ్‌కు చెందిన చోడవరం రాజయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. 15 రోజుల విధుల నిమిత్తం విజయవాడలోని తాడేపల్లిలో గల సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. రెండు రోజులుగా ఆయన అనారోగ్యం తో బాధపడుతున్నారు. గురువారం చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను మాయమాటలతో లొంగదీసుకుని తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. పీటీఎం ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కందుకూరుకు చెందిన గుర్రాల నరసింహులు అనే యువకుడు ఓ బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని తీసుకెళ్లి పోయాడన్నారు. ఆ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆ యువకుడిని పట్టుకుని అతడిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

కలకడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు అన్వర్‌సాహెబ్‌కు గాయాలయ్యాయి. మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీ దిగువపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అన్వర్ సాహెబ్ ఉదయం కలకడ నుంచి ద్విచక్ర వాహనంలో విధులకు బయలుదేరాడు. ఈ క్రమంలో గుర్రంకొండ నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయుడికి రక్తగాయాలు కావడంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


చౌటపల్లెలో అసంపూర్తిగా నిలిపోయిన ఆర్ఎస్కే భవన సముదాయం

రూ.లక్షల వ్యయం... లక్ష్యానికి దూరం

● అసంపూర్తిగా రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణాలు ● ఆర్ఎస్కేల్లో కియోస్క్ సేవలు అంతంతే

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో రైతుసేవా కేంద్రాల (ఆర్ఎస్కే) ద్వారా అన్నదాతలకు అరకొర సేవలు అందుతున్నాయి. ఈ వ్యవస్థ అమలులోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయినా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికీ బాలరిష్టాలు దాటలేదు. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, సాంకేతిక సమస్యలతో చాలా చోట్ల కియోస్క్ యంత్రాల సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలను నమోదు చేసుకుంటే ఎవరికి ఏరకం కావాలో తెప్పించే అవకాశం ఉండేది. నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు.

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 2020 మే నెలలో రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుత రైతుసేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. తొలుత ప్రభుత్వ భవనాలు లేని ప్రాంతాల్లో ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సొంత భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. లక్షల రూపాయల వ్యయంతో మొదలు పెట్టిన ఈ భవనాలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పూర్తయ్యాయి. చాలా చోట్ల నిధుల మంజూరులో జాప్యం కావడంతో అసంపూర్తిగా నిర్మాణాలు ఆగిపోయాయి. మరికొన్ని చోట్ల స్థలాల సమస్యతో భవన నిర్మాణాలు బాలరిష్టాలు దాటడం లేదు. దీంతో చాలా చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

అసంపూర్తిగా రైతు సేవా కేంద్ర భవన నిర్మాణాలు

ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు మండల పరిధిలో 17, జమ్మలమడుగు మండల పరిధిలో 13, మైలవరం మండల పరిధిలో 13, పెద్దముడియం మండల పరిధిలో 12 కలిపి మొత్తం 55 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలో 32 వేల హెక్టార్లలో రబీ పంటలు సాగు చేస్తున్నారు రైతులు. వేరుశనగ, మినుము, పెసర, నువ్వులు, శనగ, జొన్న, పొద్దుతిరుగుడు, వరి తదితర పంటల సాగులో ఉన్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, సలహాలు, సూచనలతో రైతుల శ్రేయస్సుకోసం ఈ సేవా కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. అయితే ప్రొద్దుటూరు మండల పరిధిలో 17 కేంద్రాల్లో పెద్దశెట్టిపల్లె, ఉప్పరపల్లె, చౌడూరు, కామనూరు, చెన్నమరాజుపల్లె, చౌటపల్లె, దొరసానిపల్లె, సోములవారిపల్లె, గోపవరంలలో ఆర్ఎస్కే కేంద్రా భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఉప్పరపల్లె, చౌడూరు, చౌటపల్లె, చెన్నమరాజుపల్లెల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లోనే సేవలు అందిస్తున్నారు.

● జమ్మలమడుగు మండల కేంద్రంలో రైతుసేవా కేంద్రాలకు స్థల సమస్య వెంటాడుతోంది. జమ్మలమడుగు, మోరగుడి, కన్నెలూరు ప్రాంతాల్లో స్థల సమస్యతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మిగిలిన కేంద్రాల్లో నూతన భవనాలు పూర్తయినా అవి వినియోగంలోకి రాలేదు.

● పెద్దముడియం మండల పరిధిలో పెద్దపసుపుల పంచాయతీలో 2, నెమళ్లదిన్నె, బీటీపాడు, జంగాలపల్లె, ఉలువలపల్లెల్లో అద్దె భవనాల్లో ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి. మైలవరం మండల పరిధిలో 13 సేవా కేంద్రాలు ఉండగా కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలే తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో కియోస్క్ యంత్రాలు, అసంపూర్తి భవన నిర్మాణాలపై దృష్టి సారించి పూరిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కియోస్క్ సేవలు అంతంతే..



రైతు సేవా కేంద్రాల్లో విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతలకు సేవలు అందించాల్సిన కియోస్క్ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రైతు చేతివేళ్ల అనుసంధానించడానికి, రైతులకు అవసరమయ్యే సూచనలు, సలహాలకు యూట్యూబ్ చానెళ్లను వినియోగించి కియోస్క్ యంత్రాల ద్వారా వీడియో ప్రచారం చేయాల్సి ఉంది. కేంద్రాల్లో ఇంటర్నెట్ వసతి అందుబాటులోలేదు. వ్యవసాయ సహాయకులు మాత్రం తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లలో, ట్యాబ్‌లలో సీమేడ్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తూ రైతులకు సేవలు అందిస్తున్నారు. దీంతో లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసినప్పటికి నిరుపయోగంగా ఉన్నాయి.

తాళ్లమాపురంలోని రైతుసేవా కేంద్రంలో ఉన్న కియోస్క్ యంత్రం

అన్ని యంత్రాలు పనిచేస్తున్నాయి

ఆర్ఎస్కేలలో అన్ని యంత్రాలు పనిచేస్తున్నాయి. సెల్‌ఫోన్లలో అందుబాటులో ఉన్న యాప్‌ల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ సహాయకులు సేవలు అందిస్తున్నారు. సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం.

– డి.సురేష్‌రెడ్డి
వ్యవసాయ సహాయ సంచాలకులు

జీవో145ను ఉపసంహరించాలి

● పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి


మాట్లాడుతున్న పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

కడప రూరల్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈగిల్ (ఫాస్ట్ ట్రాక్ కోర్టు)ను తిరుపతిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు గురువారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన దీక్షలకు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తరలించడం వలన కక్షిదారులు ఎంతో వ్యయప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. కడపలో ఉన్న కోర్టును కడపలోనే కొనసాగించాలని.. కడప నుంచి తిరుపతికి తరలిస్తూ ఇచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం అందె సుబ్రమణ్యం, ఆనందర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీకర్, రాజగోపాల్ రెడ్డి తదితరులు దీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్పనాయుడు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీలు అప్పుల్లో దొందూదొందే..

అప్పుల కుప్పలు చేసి ప్రజలపై బాదుడుకు దిగడంలో వైసీపీ, టీడీపీ దొందు దొందే అని పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం బాధుడు ప్రభుత్వంగా మారిందని మండిపడ్డారు 6 నెలల పాలన కాలంలో అనేక విధాలుగా ప్రజలపై భారం మోపిందన్నారు. అసెంబ్లీ కో- ఆర్డినేటర్ బండి జకరయ్య కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

29న జూనియర్స్ కబడ్డీ సెలక్షన్స్

కడప స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగర మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ పాఠశాలలో ఈనెల 29న ఆదివారం ఉమ్మడి కడప జిల్లా సబ్‌జూనియర్స్ కబడ్డీ ఎంపికల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.గోవర్ధనరెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో గల కబడ్డీ క్రీడాకారులు తప్పక హాజరై ప్రతిభ చాటాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులు ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో వచ్చే జనవరి 3, 4, 5,6 తేదీల్లో జరగనున్న 28వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వారి తాలుకా ఆధార్‌కార్డు, పదోతరగతి ఒరిజినల్ మార్క్సు లిస్టు, స్టడీ సర్టిఫికెట్ తప్పక వెంట తీసుకురావాలన్నారు. 20 సంవత్సరాల కేటగిరిలో పాల్గొనే బాలబాలికలు 2005 డిసెంబరు 1న జన్మించిన వారు అర్హులన్నారు. ఇదిలా ఉండగా బాలికలు 65 కేజీలు, బాలురు 70 కేజీ లోపు ఉండాలన్నారు. ఏదైనా ఇతర వివరాలకు... 9949851059 అనే నెంబరును సంప్రదించాలని కోరారు.

30న శ్రీహరికోటకు ఆర్టీసీ బస్సు

బద్వేలు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో నుంచి శ్రీహరికోటకు ఈనెల 30న బస్సు ఏర్పాటు చేస్తారని ఆర్టీసీ డీఎం కన్యాకుమారి పేర్కొన్నారు. ఇస్రోలో శాస్త్రవేత్తలు ప్రయోగించనున్న రాకెట్‌ను సందర్శించే అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాను పోను టిక్కెట్ ధర రూ.800 ఉంటుందని తెలిపారు. రాకెట్ లాంచింగ్ ముందు పెంచలకోన, సూళ్లూరుపేట చెంగాలమ్మగుడి, పులికాట్ సరస్సులను చూడవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ కోసం విద్యాసంస్థలు రిజిస్ట్రేషన్ కాపీని అందజేయాలని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం పేరు వయస్సు ఆధార్ కాపీలను పంపాలన్నారు. వివరాల కోసం 9959225779, 7382867104 నెంబర్లను సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

వైవీయూ పరీక్షలు జనవరి 21కి మార్పు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):యోగివేమన యూనివర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు 2025 జనవరి 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ముందుగా డిసెంబరు 30 నుంచి నిర్వహించాలని నిర్ణయించామని అయితే విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని మార్పు చేశామన్నారు. జనవరి 21, 23, 25, 27, 29, 31 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

పులివెందుల సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి

పులివెందుల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్ జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు., అనంతరం జైలు పరిసరాలు, వంట గదులను, వసతి గదులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ వీఆర్‌కు..

కొండాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండాపురంలో సీఐ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాయుడును వీఆర్‌కు పంపినట్లు సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. కానిస్టేబుల్ రాయుడు ఫోన్‌లో లైంగికంగా వేధిస్తున్నాడని ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి.. ఆయనను వీఆర్‌కు పంపారు. ప్రస్తుతం రాయుడుపై విచారణ జరుగుతోందని సీఐ తెలిపారు.

పాఠశాలకు వాటర్‌ప్లాంటు వితరణ


ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న వైవీయూ మాజీ వీసీ సూర్యకళావతి

కమలాపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తన తండ్రితో పాటు తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో సుమారు రూ.6లక్షల విలువజేసే వాటర్ ప్లాంట్ వితరణగా అందించినట్లు మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లెకు చెందిన శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పెద్దచెప్పలి జిల్లా పరిషత్ హైస్కూలులో తన తండ్రి జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ప్లాంటును యోగి వేమన యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ సూర్యకళావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివిద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ విద్యా సలహాదారుడు సాంబశివారెడ్డి, ఎంఈఓ సుభాషిణి, చంద్రకాంత్‌రెడ్డి, డాక్టర్ మాధవి, ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్లు పుల్లారెడ్డి, మైసూరారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి : వీసీ


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారతదేశం విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని.. కడప సంస్కృతి ఎంతో గొప్పదని యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం యోగివేమన యూనివర్సిటీ ప్రాగణంలో భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ విశాఖపట్టణానికి చెందిన యువత కడప జిల్లా చరిత్రను, విశిష్టతను తెలుసుకునేందుకు ఇక్కడకి రావడం అభినందనీయమన్నారు. డిసెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు జిల్లా పరిధిలోని వివిద ప్రాంతాలను యువత సందర్శిస్తారని అన్నారు. ఇతర ప్రాంతాలలోని వారసత్వ కట్టడాలను చూడడం ద్వారా సమాజంపైన యువతకు ఒక అవగాహన ఏర్పడుతుందన్నారు. సమాజంలో ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ మాట్లాడుతూ సంస్కృతిక సాంప్రదాయాల కోసం ప్రత్యేకంగా ఇలాంటి వేదికలు రూపొందించినపుడు ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని యువతకు పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కడప అంటే బాంబుల గడ్డ కాదు కవులకు నిలయం అన్నారు.
కార్యక్రమంలో వైవీయూ ఎన్ఎస్ఎస్ లక్ష్మి, నెహ్రూ యువకేంద్ర అకౌంట్స్ ఆఫీసర్ బాబురెడ్డి, సిబ్బంది, జాతీయ సేవ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు - బైకు ఢీ... వ్యక్తి మృతి



సింహాద్రిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అగ్రహారం గ్రామ సమీపాన సింహాద్రిపురం-పులివెందుల రోడ్డులో కారు-మోటారు బైకు ఢీకొన్న ప్రమాదంలో కొమ్మా నీలకంఠారెడ్డి(65) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ తులసీనాగప్రసాద్ సమాచారం మేరకు... కసనూరు గ్రామానికి చెందిన నీలకంఠారెడ్డి బైకుపై వస్తుండగా సింహాద్రిపురం నుంచి పులివెందుల వైపు వెళ్లే కారు ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతునికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుర్లు కలరు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జమ్మలమడుగు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నాగులకట్టవీధిలో రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో దూదేకుల మనోహర్ (41) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. నాగులకట్ట వీధికి చెందినమనోహర్‌ను భార్య విడిచిపెట్టి వెళ్లిపోవడంతో గత కొన్ని నెలలుగా పట్టణంలో తిరుగుతూ.. వీధుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వస్తువులు తీసుకుని ప్లాస్టిక్‌వ్యాపారుల వద్ద విక్రయించేవాడు. అయితే ఉన్నట్లుండి బైపాస్ రోడ్డు పక్కన అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అర్బన్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ కింద పడి మహిళ మృతి


రామలక్షుమ్మ(ఫైల్)

సిద్దవటం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె శనీశ్వర గుడి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో రామలక్షుమ్మ (55) మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గురువారం ఉదయం ఆట్లూరు మండలం కమలకూరు గ్రామం నుంచి రామక్రిష్ణారెడ్డి, రామలక్షుమ్మ(55) ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతున్నారు. కనుమలోపల్లె శనీశ్వర గుడి సమీపానికి రాగానే వర్షానికి ద్విచ క్రవాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. అదే సమయంలో కర్నూలు నుంచి చెన్నైకు వెళుతున్న లారీ కింద వెనుక వైపు కూర్చు న్న రామలక్షుమ్మ పడటంతో మృతి చెందింది. శవ పంచనామా నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమో దు చేసినట్లు ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలియజేశారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

● తప్పిన ప్రమాదం

సికెదిన్నె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో ఆగి ఉన్న కారును లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదని సీకెదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు కడప నుంచి రాయచోటివైపు వెళుతున్న కారు మూడవ మలుపు వద్ద ఆగి ఆంజనేయస్వామి గుడిలోకి వెళ్లి దర్శనం చేసుకుంటుండగా అదే సమయంలో రాయచోటి వైపు నుంచి ఘాట్ దిగుతున్న లారీ అదుపు తప్పి కారుపైకి దూసుకొచ్చి మట్టికట్టపైకి ఎక్కి ఆగిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని గొర్రెలు మృతి

ముద్దనూరు డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కడప తాడిపత్రి హైవే రోడ్డులోని ఓబులాపురం గ్రామం వద్ద గురువారం రాత్రి గొర్రె ల మందపై టిప్పర్ దూసుకెళ్లడంతో ఓబులాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గణేష్‌కు చెందిన 10 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి గణేష్ సమాచారం మేరకు.. గొర్రెల మందను మేతకోసం కొండకు తోలుకెళ్లి తిరిగి ఓబులాపురం గ్రామం వస్తుండగా కొండాపురం వైపు టిప్పర్ అతివేగంగా రోడ్డు పక్కన వెళుతున్న గొర్రెల మందపైకి దూసుకు వచ్చింది. దీంతో దాదాపు 10 గొర్రెలు మృతి చెందాయి. టిప్పర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లాడని, దాదాపు రెండు కిలోమీటర్ల వద్ద టిప్పర్‌ను నిలిపామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు గొర్రెల కాపరి తెలిపారు.

విద్యార్థినిపట్ల అనుచిత ప్రవర్తన

పోరుమామిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్దులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఉపాధ్యాయుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు జోక్యం చేసుకుని సమస్యను సర్దుబాటు చేశారు. కాగా జరిగిన విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. వివరాల్లోకెళితే.. పోరుమామిళ్ల మండలంలోని ఓ జిల్లా పరిషత్తు హైస్కూలులో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై హిందీ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఆ విషయం ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలపడంతో వారు గురువారం స్కూలు వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు అతనిపై ఎక్కడ దాడి చేస్తారోనని భావించి ముందుగానే ఓ తరగతిగదిలో ఉంచి నట్లు తెలిసింది. వెంటనే వారు రెవెన్యూ సదస్సులో తహ సీల్దార్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఉపాధ్యాయుడు పాఠశాలను వదిలి వెళ్లిపోవాలని, మళ్లీ వస్తే సహించేది లేదని గ్రామస్థులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయమై ఎంఈఓ అంకిరెడ్డిని వివరణ కోరగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అక్కడ జరిగిన విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గతంలో కూడా ఆ ఉపాధ్యా యుడిపై ఫిర్యాదులు అందాయని, జరిగిన విషయాలను డిప్యూటీ డీఈఓ దృష్టికి తీసుకువెళుతున్నట్లు ఆయన తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతబోలు గ్రామంలోని వంగాడవారిపల్లెలో గురువారం భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ పడ్డారు. వంగాడవారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు సతీష్(28) అదే గ్రామానికి చెందిన శివకుమార్‌లు పొలం దున్నకం గురించి గొడవపడ్డారు. దీంతో శివకుమార్ ఆవేశంతో సతీష్‌పై కొడవలితో దాడి చేసి గాయపర్చారు. గాయపడిన బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

కారు ఢీ.. మహిళ మృతి

అట్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో సంగటి సుబ్బమ్మ(70) దుర్మరణం చెందింది. లింగాల కుంట వాసి సుబ్బమ్మ లింగాల కుంట వద్ద రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఢీకొన్న కారులో బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. కారు పెనగలూరు ఎంపీడీఓకు చెందినదిగా స్థానికులు గుర్తించారు.

ఇద్దరు యువకులపై కొడవలితో దాడి...

కురబలకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులపై కొడవలి, రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. చింతమాకులపల్లె పంచాయతీ అమ్మచెరువు మిట్ట సమీపంలో అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు(32), బసినికొండకు చెందిన అతని సమీప బంధువు గుణశేఖర్ (22)లు బీఏ రాజు ఇంటి సమీపంలో నిలబడి మాట్లాడుతుండగా అనుమానంతో రాజు అతని కుటుంబీకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ యువకులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుణశేఖర్‌ను మెరుగైన చికిత్సల నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేరుశనగ పంటపై పందుల దాడి


పందులు దాడి చేసిన వేరుశనగ పంట

సుండుపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భగంపల్లి గ్రామ పంచాయతీ కుంటలముందరలో రైతు నాగిరెడ్డి సాగు చేసిన వేరుశనగ పొలంలో బుధ వారం రాత్రి అడవి పందులు దాడి చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు ఎకరాల వేరుశనగ సాగు చేశామని, సుమారు 35 కుంటల వరకు పందుల దాడి కారణంగా నష్టం జరిగిందన్నారు. పందుల బెడద కారణంగా ప్రతిసారి పంటలు సాగు చేసినప్పుడు నష్టం చవి చూస్తున్నామని, వాటి బారి నుంచి కాపాడాలని అధికారులను కోరారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

పుల్లంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవరకొండ గుట్ట వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం దేవరకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పెంచలకోన 6వ మహాపాదయాత్ర సందర్భంగా ఈ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో వందలాది మంది లక్ష్మీనరసింహస్వామి మాలలు ధరించారు. కల్యాణానికి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి భక్తులకు పందిళ్లు వేసి అందంగా అలంకరించారు. మేళతాళాల మధ్య వేదపండితులు, మంత్రోచ్చరణ చేస్తుండగా ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదికపైకి తీసుకొచ్చి శాశ్వతంగా కల్యాణాన్ని నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని కనులారా వీక్షించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు పిలువరా..?

●ప్రోటోకాల్ పాటించడంలేదంటూ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం ●చేయని పనులు రద్దు చేయండి ●ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు అవుతోంది..పట్టణంలో ప్రభుత్వ పరంగా చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తమకు మున్సిపల్, సచివాలయ సిబ్బంది సమాచారం ఇవ్వడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరికి చెప్పినా..అప్పటికప్పుడు ఫోన్ చేసి పిలుస్తున్నారని వాపోయారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన బడ్జెట్, సాధారణ సమావేశాలు నిర్వహించారు. వార్డుల్లో అధికారులు, సిబ్బంది ప్రోటోకాల్ పాటించడం లేదని, కనీసం తమను కౌన్సిలర్లుగా కూడా గుర్తించడం లేదని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తెచ్చారు. నెలనెలా ఇచ్చే పింఛన్ల పంపిణీకి కూడా ఆహ్వానించడం లేదని, కనీసం ఎక్కడ ఇస్తున్నారో కూడా చెప్పడం లేదని, సచివాలయ సిబ్బంది అయితే మరీ దారుణంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎక్స్‌అఫిషియోహోదాలో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా స్పందించారు. ఆయా వార్డుల్లో జరిగే కార్యక్రమాలకు ఆయా కౌన్సిలర్లు కచ్చితంగా సమాచారం ఇవ్వాలని, ప్రోటోకాల్ పాటించాలని, ఇక నుంచి అలా జరగకుండా చూడాలని ఎమ్మెల్యే, అధికారులను ఆదేశించారు. పట్టణంలో అభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు సహకరించాలని ఎమ్మెల్యే


అధికారిక కార్యక్రమాలకు సమాచారం లేదని సమావేశంలో లేచి ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

సూచించారు. కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తెచ్చిన సమస్యలు మరోసారి రాకుండా చూడాలని కమిషనర్ కె.ప్రమీల, ఇతర విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగలేదనే అంశాన్ని కౌన్సిలర్లు ప్రస్తావించగా, వార్డుల్లో ఇప్పటికే మంజూరైన పనులను కాంట్రాక్టర్లు బాధ్యతగా పనిచేయాలని, లేకుంటే రద్దు చేసి, తిరిగీ టెండర్ పిలవాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో కాస్తం జాప్యం జరుగుతోందని, ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సీఎఫ్ఎంఎస్‌ను రద్దు చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య, రోడ్ల విస్తరణ చర్చకు రాగా, సీటీఎం రోడ్డు తరహాలో గాంధీరోడ్డు, అవెన్యూరోడ్డు, కదిరిరోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే మేదరవీధి మీదుగా జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ ఆనుకుని రోడ్డును వెడల్పు చేసి, లింకు రోడ్డును కలుపుతామన్నారు. బాహుదాపై పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అన్ని శాఖల అధికారులతో సంప్రదింపులు చేస్తున్నట్లు ఆయన వివరించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ శానిటరీ విభాగం, డీజిల్, పెట్రోల్, పాగింగ్‌లో ఎక్కువగా అక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. మరో వైస్‌చైర్మన్ బి.ఎ.నూర్‌ఆజాం మాట్లాడుతూ బాహుదాలో వ్యర్థాలు వేయకుండా కాలువ పొడవు నా..కంచె వల ఏర్పాటు చేయాలని సూచించారు. కౌన్సిలర్ బి.ఎ.ఖాజా మాట్లాడుతూ దక్నీపేటలోని మాంస పుమార్కెట్‌ను బడ్జెట్ కాపీలో చూపకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. గత మూడేళ్ల తో పోలిస్తే, గురువారం నాటి సమావేశంలో సమస్యల ప్రస్తావనకు కౌన్సిలర్లు పోటీ పడటాన్ని కౌన్సిలర్ ప్రసాద్‌బాబు స్వాగతించారు. సమస్యలు ప్రస్తావించిన వారిలో కౌన్సిలర్లు పెరవలి రాజేష్, కె.ప్రసాద్‌బాబు, వాయిస్ కరీముల్లా, మేస్త్రీ శ్రీని వాసులు, ఎస్.వశీంఅక్రమ్, ఎస్.షబానా, ఎస్.ము బీనా, తదితరులు ఉన్నారు. సాధారణ, బడ్జెట్ సమావేశపు అజెండాలోని అన్ని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

మదనపల్లె టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్ అయినట్లు ఎస్వీ యూనివర్సిటీ సీఈ(కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) దామ్లానాయక్ తెలిపారు. గురువారం పట్టణంలోని నాలుగు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొదటి సెమిస్టర్ డిగ్రీ పరీక్షలు నిర్వహించారు. ఫౌండేషన్ కోర్సులో లీడర్ షిప్ స్కిల్స్ పరీక్షలో భాగంగా ఎస్వీ యూనివర్సిటీ నుంచి హైపర్ కమిటీ సభ్యులు ఆకస్మాత్తుగా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. రెండు కళాశాల్లో ఐదుగురు విద్యార్థులు చీటీలు దాచిపెట్టి చూసి రాస్తుండగా స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్క్వాడ్ అధికారులు రమేష్‌బాబు, శ్రీనివాసులు, చంద్రశేఖర్ మాట్లాడుతూ పలు పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్ల పర్యవేక్షణ సరిగ్గా లేదని, పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు తిరుగుతూ ఉండాలని ఆయా పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్, అబ్జర్వర్‌లకు సూచించారు. కాగా ఒకే రోజులు ఐదుగురు విద్యార్థులు చూచిరాతలు రాస్తూ పట్టుబడి డీబార్ కావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు వితరణ



మదనపల్లె అర్బన్, డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి):పట్టణంలోని పారిశుధ్య కార్మికులకు మదనపల్లె యూత్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఆర్ సురేష్ గురువారం రెయిన్ కోట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమన్నారు. వర్షాకాలంలో వారు ఇబ్బందులు పడకూడదని రెయిన్‌కోట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో డీఎం అభినయ, కాంత్ పాల్గొన్నారు.

ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ పున:ప్రారంభం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి): స్థానిక నీరుగుట్టువారిపల్లె మారుతీనగర్‌లోని ప్రసన్న ఆజంనేయస్వామి ఆలయం గురువారం ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగు యువత రాష్ట్రఅధ్యక్షుడు శ్రీరాంచినబాబు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బండిరామమూర్తి, అంగడిరాజా, సత్యనారాయణ, ఎస్వీ రమణ, మనోహర్, నాగరాజ, సింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న శ్రీరాంచినబాబు

దశాబ్దం తరువాత భూనిర్వాసితులకు న్యాయం

●33 మంది పేదలకు ఇంటి పట్టాలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):దశాబ్దం తరువాత గుంటివారిపల్లె ఎస్ఎస్ ట్యాంకు భూనిర్వాసితులకు న్యాయం జరిగింది. సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నిర్మాణంతో ముంపునకు గురైన నాయనివానిపల్లె గ్రామానికి చెందిన 33 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ నాయనివారిపల్లె నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ హంద్రీ-నీవాకు అనుసంధానంగా నిర్మించిన గుంటివారిపల్లె ఎస్ఎస్‌ట్యాంకుతో నాయనవానిపల్లెకు చెందిన 33 మంది పేదల ఇళ్లు ముంపునకు గురయ్యాయన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు వందల సార్లు అర్జీలుపెట్టుకున్నా ఆ ప్రభుత్వ కనికరం చూపలేదన్నారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే భూ నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజి కింద ఒక్కొక్కరికి మూడు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేశామన్నారు. కొత్తగా నిర్మించనున్న కాలనికి వెళ్లే దారిలో హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబి, టీడీపీ నాయకులు పూలకుంట్లహరి, ఎం.ప్రభాకర్, కత్తిలక్ష్మన్న, చంద్రశేఖర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


భూ నిర్వాసితులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె మున్సిపల్ బడ్జెట్ రూ.114 కోట్లు

మదనపల్లె, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపల్ సాధారణ బడ్జెట్ రూ.114,59,28,060 ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల పేర్కొన్నారు. 2025-26 ఏడాదికి బడ్జెట్ అంచనాలు రూపొందించి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన బడ్జెట్ సమావేశంలో కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టారు. ఇందులో మున్సిపాలిటీకి వివిధ రూపాల్లో వచ్చే సాధారణ ఆదాయం, గ్రాంట్లు, వ్యయాలను రూపొందించారు. ఇందులోభాగంగా మున్సిపాలిటీలోని ఆస్తి, నీటి, తదితర పన్నులు, టౌన్ ప్లానింగ్‌లోని ఫీజులు, తదితరాల నుంచి 2024-25 ఏడాది సవరించిన బడ్జెట్‌లో రూ.54,76,34,882 ఉండగా, 2025-26 ఏడాదికి రూ.59,05,96,437 ఉంటుందని అంచనా బడ్జెట్ చూపించారు. అలాగే అదే పద్దులో 2024-25 సవరించిన బడ్జెట్ వ్యయం రూ.41,65,20,000 కాగా, 2025-26 నాటి అంచనా బడ్జెట్‌ను రూ.44,29,75,000గా పేర్కొన్నారు. అలాగే వనరుల ద్వారా మూలధన ఆదాయం(కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే వివిధ గ్రాంట్లు) 2024-25 ఏడాది సవరించిన బడ్జెట్ రూ.54,98,00,000 కాగా, 2025-26 ఏడాదికి అంచనా బడ్జెట్ రూ.58,98,00,000గా ఉంటుందన్నారు. అలాగే ఇదే పద్దులోని వ్యయాన్ని 2024-25లో రూ.57,40,00,000 సవరించిన బడ్జెట్ కాగా, 2025-26 ఏడాదిలో అంచనా వ్యయం రూ.69,55,50,000 ఉంటుందని కమిషనర్, చైర్‌పర్సన్‌లు చూపించారు. మొత్తమ్మీద తీసుకుంటే 2024-25 ఏడాదిలో సవరించిన బడ్జెట్ అంచనాల్లో సాధారణ పద్దుల జమలు రూ.54,76,34,882, క్యాపిట ల్ పద్దుల జమలు(గ్రాంట్లు) రూ.54,98,00,000 కాగా, ప్రారంభ నిల్వలో నుంచి తీసేయగా, రూ.109,74,34,882గా తేల్చారు. సాధారణ పద్దుల ఖర్చులు రూ.41,65,20,000, క్యాపిటల్ పద్దులు ఖర్చులు రూ. 57,40,00,000 కలిపి మొత్తం రూ.99,05,20,000గా పేర్కొన్నారు. 2025-26లో సాధారణ పద్దుల జమలు రూ.59,05,96,437, క్యాపిటల్ పద్దుల జమ రూ.58,98,00,000లు మొత్తం రూ.118,03, 96,437గాపేర్కొన్నారు. మరోవైపు 2025-26లో ఖర్చుల విషయంలో సాధారణ పద్దుల నుంచి రూ.44,29,75,000, క్యాపిటల్ పద్దుల నుంచి రూ.113,85, 25,000 కాగా, ముగింపు నిల్వ రూ.114,59,28,060గా వివరించారు. ఈ బడ్జెట్ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, కౌన్సిలర్లతోపాటు .పద్దుల వారీగా వివరాలు అడిగి తెలుసుకు న్నారు. అనంతరం పాలకవర్గం 2025-26 ఏడాదికి ప్రవేశ పెట్టిన అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

వంక అక్రమణలపై సర్వే



గుర్రంకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఆక్రమణలకు గురైన వంక స్థలాన్ని గురువారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఇందులో భాగంగా సర్వే నెంబరు 503లో 10.44 ఎకరాల్లో భూమి ఉండగా ఈ సర్వే నెంబరులోని 503/8లో 1.01 ఎకరాల్లో వంక పొరంబోకు స్థలం కడప-బెంగుళూరు జాతీయ రహదారి పక్కన ఉంది. దీంతో ఈ స్థలాన్ని కొందరు వైసీపీ నాయకులు అక్రమించుకొని చదును చేసి ప్లాట్లు వేసి అమ్మడానికి సిద్ధం చేస్తున్నారు. దీంతో వంక అక్రమణలపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేయడంతో వీఆర్వోలు సదాశివప్పనాయుడు, అమీర్, సర్వేయరు వినోద్ కలిసి వంక పొరంభోకు స్థలాన్ని సర్వే చేసి హద్దులు గుర్తించారు. ఈ స్థలం చాలా వరకు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వాటిపై తహశీల్దార్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వీఆర్వోలు తెలిపారు.

మతసామరస్యానికి మారుపేరు మదనపల్లె

మదనపల్లె టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి, ప్రశాంతతకు మారు పేరుగా మద నపల్లె నిలిచిందని ఎమ్మెల్యే షాజహా న్‌బాషా, బీజేపీ నేత ఎస్.సేతు పేర్కొ న్నారు. గురువారం పట్టణంలోని మేదరవీధికి చెందిన అయ్యప్పభక్తుడు వెంకటేశ్ ఇంటికి వెళ్లిన నాయకు లు సంఘీభావం తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం రాత్రి అనుకోని ఘటన జరిగినా అందరు సంయమనం పాటించి ఉద్రిక్త పరిస్థితులు లేకుండా చేశారన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే కులమతాలకు అతీతంగా అందరూ కలసిమెలసి జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లంపల్లె ప్రశాంత్, జర్మన్‌రాజు, టీడీపీ నాయకులు నాగార్జునబాబు, రెడ్డిప్రసాద్, నాదెళ్ల శివన్న, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు

పీలేరు/మదనపల్లె అర్బన్/ములకలచెరువు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టుపార్టీ శతవార్షికోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పీలేరులోని ఆపార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సభ్యత్వాలను పునరుద్ధరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ మాట్లాడుతూ గడిచిన వందేళ్లుగా తాడిత, పీడిత ప్రజల గొంతుకగా సీపీఐ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి నరసింహులు, సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు యశోద, సౌజన్య, శ్యామల, వెంకటరమణ, రాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బా శ్రీకాంత్, బాబు, రమణ పాల్గొన్నారు. మదనపల్లె పట్టణంలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు కరీముల్లా, కృష్ణప్ప, సాంబశివ, రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ భారత గడ్డపై 1952 డిసెంబరు 26వ తేదీన కాన్పూర్ మహానగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు సూరి, తిరుమల, మాధవ్, రెడ్డి, నవీన్, శ్రీనివాస్ గౌడ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, ప్రజాసంఘాల నాయకలు పాల్గొన్నారు. ములకలచెరువు రైల్వేగేటు వద్ద సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకుడు మంత్రాల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నిజాముద్దీన్, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కార్యదర్శి రమేష్‌బాబు, డప్పు కళాకారుల సంఘం నాయకుడు రెడ్డెప్ప, నాయకులు చంద్ర, భాస్కర్, సుబ్బన్న, ఎల్లప్ప, శంకరమ్మ, లక్ష్మీదేవి, ఎల్లమ్మ, పాపులమ్మ, నజీమా తదితరులు పాల్గొన్నారు.


ములకలచెరువులో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాగునీరు, పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దు

వాల్మీకిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యం పనులు నిర్లక్ష్యం చేయక ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మనోహరరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయలంలో వైస్ ఎంపీపీ డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కిరణ్, జడ్పీటీసీ నిర్మల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణను సన్మానిస్తున్న సభ్యులు

కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం: రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మాజీ ఎంపీపీ వల్లిగట్ల వెంకటరమణను గురువారం మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఘనంగా సన్మానించారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయనను శాలువ, గజమాలతో సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షుడు పులి నరేంద్రరెడ్డి, జనసేన అధ్యక్షుడు ప్రభాకర్, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజకీయంతోనే టీఎన్‌టీయూసీ రెండో కార్యవర్గం

● అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం ●ఎస్‌ఏ మస్తాన్

మదనపల్లె టౌన్, డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె మార్కెట్‌యార్డులో రెండో టీఎన్‌టీయూసీ కార్యవర్గం రాజకీయ దురుద్దేశ్యంతోనే ఏర్పాటు చేశారని టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక టమోటా మార్కెట్‌లో నిర్వహించిన టీఎన్‌టీయూసీ నాయకులు, హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన టీఎన్‌టీయూసీ కార్యవర్గాన్ని ఎంపిక చేయగా, కొంత మంది ఎమ్మెల్యే పేరుచెప్పుకుని రెండో టీఎన్‌టీయూసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్మికులు నాయకులుగా ఏర్పడ్డ తమ కార్యవర్గాన్ని కాదని కేవలం దళారులు, వ్యాపారులను సభ్యులుగా ఇంకో కార్యవర్గం ఏర్పాటు చేయడం దౌర్భాగ్యమన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన తప్పుపట్టారన్నారు. నిబంధనల ప్రకారమే తాము టీఎన్‌టీయూసీ కార్యవర్గం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ జరుగుతున్న విషయాలను టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు, కార్యదర్శి శ్యామ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు రామయ్య, రసూల్, మహబూబ్‌బాషా, చలపతి, షామీర్, మురాషా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్

ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ వైద్యుడికి సత్కారం

బి.కొత్తకోట, డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి స్పృహకోల్పోయిన వ్యక్తిని కాపాడిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ వెంకట్రామ య్యను స్థానికులు, బాస్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ నెల 24న ములకలచెరువు మండల సరిహద్దు శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని చీకటిమానిపల్లె వద్ద లారీ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో అనిల్ అనే యువకుడు తీవ్రంగా గాయపడిగా, అదే సమయంలో అటుగా వస్తున్న డాక్టర్ వెంకట్రామయ్య సీపీఆర్ చేసి ఆ యువకుడి ప్రాణాలు కాపాడారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన అనిల్ ఊపిరి తీసుకోవడంతో ఆసుపత్రికి తరలించారు. వెంకట్రామయ్య కృషితో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో పలువురు పట్టణ ప్రముఖులు ఆసుపత్రి సిబ్బంది కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా.కిరణ్ సమక్షంలో వెంకట్రామయ్యను పూలమాలలు, దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో సచి న్, నక్కామహేష్, మాధవ, గంగాద్రి, జనార్ధన్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


వెంకట్రామయ్యను సత్కరిస్తున్న స్థానికులు

తైక్వాండో విద్యార్థులకు ఆర్థిక సాయం

ములకలచెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో పోటీలకు వెళ్తున్న ములకలచెరువు కస్తూరిబాగాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ రూ.25వేలు ఆర్థిక సహాయం అందచేశారు. కోల్‌కత్తాలో ఈ నెల 27వ తేదీ నుంచి జరగనున్న అంతర్జాతీయ పోటీలు, సెలక్షన్స్‌లో పాల్గొనే విద్యార్థులు రేఖ, రాధ, ఐశ్వర్యలకు ఖర్చుల నిమిత్తం తన వంతు సాయంగా ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సుదర్శన్, ఉత్తన్న, అంజి, శంకర, సురేంద్ర, అనీల్, పవణ్, అరుణ్‌రెడ్డి, అలీఖాన్, కిరణ్‌కు మార్, తదితరులు పాల్గొన్నారు.


జనసేన నేత సాయినాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

అసంపూర్తి మురుగు కాలువను పూర్తిచేయండి

పీలేరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే దారిలో అసంపూర్తిగా ఉన్న మురుగునీటి కాలువను వెంటనే పూర్తిచేయాలని మాషా అల్లాహ్ ఆటో యూనియన్ నేతలు పీలేరు ఈవో గురుమోహన్‌కు విజ్ఞప్తి చేశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన మురుగునీటి కాలువ కారణంగా ఆ దారిలో ప్రయాణికులు ఎవరూ రావడం లేదని, తద్వారా తమ ఉపాధి పూర్తిగా దెబ్బతినిందన్నారు. ఈ మేరకు గురువారం వారు స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈవోకు వినతి పత్రం అందించారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఈవో వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాషా అల్లాహ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చాన్ బాషా, మహ బూబ్ బాషా, నాయకులు నాగూర్, చాందిని, అల్తాఫ్, శివయ్య, నౌషాద్ అలీ, ఖాదర్ వలీ, ఇబ్రహీం, జాకీర్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.


ఈవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలని వినతి

బి.కొత్తకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలని రియల్టర్ అసో షియేషన్ ప్రతినిధులు గురువారం స్థానిక సబ్ రిజి స్ట్రార్‌ను కోరారు. ఆమేరకు వారొక వినతిపత్రాన్ని సబ్ రిజిస్ట్రార్‌కు అందజేశారు. ప్రస్తుతం రైతులు పంటలు లేక తమ భూములను బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్‌లకు మార్టిగేజ్ చేయడం, లేదా మార్టిగేజ్ ను రద్దుచేసుకోవడం మాత్రమే ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామన్నారు. పుడమితల్లి రియల్టర్స్ అధ్యక్షుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

కలకడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుడిబండ గ్రామంలో అక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులకు గురువారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఫణికుమార్‌కు వారొక వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 52, 22లోని కుంట, పశువుల మంద భూములు అక్రమణలకు గురైనట్లు తెలిపారు. అలాగే సర్వే నెంబరు 50లో కుంటను బండరాళ్లతో పూడ్చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమార్కులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

రైతు సదస్సులు వినియోగించుకోండి

పెద్దమండ్యం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) రైతు సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఈఈ వెంకటదాస్, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని కలిచెర్ల సచివాలయం గురువారం రైతు సదస్సులో వారు మాట్లాడుతూ రైతు సమస్యలతో పాటు అన్ని రకాల అర్జీలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, సర్పంచ్ విశ్వనాథ, కూటమి నేతలు ప్రభాకరరెడ్డి, శేషాద్రి, ప్రదీప్, సయ్యద్‌షావలి, రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు పక్కాగా ఉండాలి

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు రికార్డులను పక్కాగా నమోదు చేయాలని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పెర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని అంకిరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంగన్‌వాడీ కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వకూడదని, పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గ్రిప్‌టైల్ ఇంటర్‌లాకింగ్‌పై పేటెంట్

కురబలకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగానికి గ్రిప్‌టైల్ ఇంటర్‌లాకింగ్ ఇటుకల రూపకల్పనపై పేటెంట్ గుర్తింపు హక్కులను పొందినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సివిల్ విభాగాధిపతి దీపాంకర్‌రాయ్, ప్రొఫెసర్‌లు అనిత, నక్కీరన్, విద్యార్థిని వైష్ణవిలు ఇటుకల రూపకల్పకు పేటెంట్ హక్కులను పొందారన్నారు. దీంతో కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు అభినందించారు.


సిబ్బందిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆవులపల్లె ఘటన కేసులో ఏడుగురు అరెస్టు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):ఆవులపల్లె దాడి కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. అరెస్టు అయిన వారు శ్రీనాథ్, కృష్ణమూర్తి, నరేష్, గాయత్రి, ఈశ్వరమ్మ, సింహాద్రి, బాలాజీలు ఉన్నట్లు చెప్పారు. కాగా ఎనిమిది మంది కేసులో ఇంకా అరెస్టు చూపాల్సి ఉందన్నారు. వారు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ కండెక్టర్ నిజాయితీ

● ప్రయాణికుడు పొగొట్టుకున్న నగదు అప్పగింత

ములకలచెరువు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డిపోలో ఆర్టీసీ కండెక్టర్‌గా పనిచేస్తున్న దయాళన్ తన నిజాయితీని చాటుకున్నాడు. ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన నగదును అప్పగించాడు. వివరాల్లోకి వెళితే...శ్రీ సత్యసాయి జిల్లా ఓడీసీ మండలం గాజుకుంట్లపల్లెకు చెందిన శివప్రసాద్ గురువారం కదిరి నుంచి మదనపల్లెకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కి ములకలచెరువుకు టికెట్ తీసుకున్నాడు. ఈ తీసుకునే క్రమంలో అతని పర్సు కూర్చున్న సీటులో పడిపోయింది. ములకలచెరువు రావడంతో గమనించుకోకుండా బస్సులో నుంచి దిగిపోయాడు. ఈ క్రమంలో మదనపల్లె - 1 డిపోకు చెందిన కండెక్టర్ దయాళన్ సీటులో ఉన్న పర్సును గమనించి చూడగా అందులో రూ.5,500 నగదు ఉంది. దీంతో ఆయన పర్సు, నగదును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా పోలీసులు పర్సులో ఉన్న ఆధారాలతో బాధితుడికి ఫోన్ చేశారు. కొంత సేపటికి బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పర్సు, నగదును తీసుకెళ్లాడు. దీంతో నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ కండెక్టర్‌ను పలువురు అభినందించారు.

నేడు పీలేరులో జాబ్ మేళా

పీలేరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10 నుంచి పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 30 ఏళ్ల వయసున్న నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు డిగ్రీ కళాశాలలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివ రాలకు 9966086996 నెంబరుకు సంప్రదించాలన్నారు.

రేపు ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

మదనపల్లె టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఎస్ఎఫ్ఐ తొలి మహాసభలను ఈనెల 28న నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం విద్యార్థులతో ర్యాలీ అనంతరం మహాసభ ఉంటుందన్నారు. అలాగే 29న జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చే ప్రతినిధుల సభ నిర్వహిస్తామన్నారు.